


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 09-06-2025 | సంపుటి - 24 | సంచిక - 38 | రూ : 4 | పేజీలు: 8


# తెలంగాణ రాజ్ భవన్ లో మంత్రుల ప్రమాణ స్వీకారం







- మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన ముగ్గురు ఎమ్మెల్యేలు
- డిప్యూటీ స్పీకర్ గా ఒకరు

తెలంగాణ క్యాబినెట్ లో మరో ముగ్గురు నేతలకు చోటు దక్కింది. కొత్తగా ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు ఈ రోజు ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్ భవన్ లో నూతన మంత్రులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం చేసిన వారిలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఉన్నారు. తాజా విస్తరణలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మాత్రమే అవకాశం కల్పించింది. కాగా, ఈసారి మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలకు చోటు దక్కుతుందని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతానికి ఎస్సీ, బీసీలకు మాత్రమే అవకాశం ఇవ్వాలని అధిష్టానం సూచించినట్లు తెలిసింది. కొత్త మంత్రులతో పాటు శాసనసభ డిప్యూటీ స్పీకర్ గా రామచంద్రునాయకన్ ను కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది.

## "వేశ్యలు" అంటూ చేసిన ఈ వ్యాఖ్యలను ఉపేక్షించే పరిస్థితే లేదు: సీఎం

**రాజధాని మహిళలపై సాక్షి టీవీలో జర్నలిస్ట్ కృష్ణంరాజు వివాదాస్పద వ్యాఖ్యలు**

- జర్నలిస్ట్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, ఖండన
- స్త్రీ జాతిని అవమానిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేసిన సీఎం
- మాజీ సీఎం జగన్ తీరుపై చంద్రబాబు అసంతృప్తి, విచారం
- మహిళల మనోభావాలు దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



రాజధాని అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి సాక్షి టీవీ ఛానల్ లో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజధాని గురించి, అక్కడి మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా 'వేశ్యలు'

తరువాయి 2లో

## ముగిసిన మాగంటి అంత్యక్రియలు.. పాడె మోసిన కేటీఆర్, హరీశ్ రావు

- జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ కన్నుమూత
- గుండెపోటుతో ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరైన కేటీఆర్, హరీశ్ రావు, పలువురు బీఆర్ఎస్ నాయకులు
- మూడు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరిన గోపీనాథ్
- గత కొంతకాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఎమ్మెల్యే

2లో



## పాస్ వర్డ్ లు ఇక వద్దు... యూజర్లకు గూగుల్ అలర్ట్!

- జీమెయిల్ భద్రతకు పాత పద్ధతులకు స్వస్తి చెప్పాలన్న గూగుల్
- పాస్‌వర్డ్‌లు, టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ బదులు పాస్‌కీలు, సోషల్ సైన్-ఇన్‌లు ఉత్తమం
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో పెరుగుతున్న సైబర్ దాడుల నేపథ్యంలో ఈ మార్పు
- పాస్‌కీలు ఫిషింగ్ దాడులను సమర్థంగా అడ్డుకుంటాయని గూగుల్ వెల్లడి
- ఇన్‌స్టాగ్రామ్ అధినేత ఆడమ్ మోసెరీకి కూడా ఫిషింగ్ అనుభవం

2లో




## మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి నారా లోకేశ్

- మాగంటి గోపీనాథ్ గుండెపోటుతో మృతి
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన నారా లోకేశ్, బ్రాహ్మణి
- మాదాపూర్ లోని గోపీనాథ్ నివాసానికి వెళ్లి నివాళి అర్పించిన లోకేశ్, బ్రాహ్మణి
- గోపీనాథ్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన వైనం



జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ అకాల మరణం అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్, ఆయన అర్ధాంగి నారా బ్రాహ్మణి కూడా మాగంటి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారు హైదరాబాద్ మాదాపూర్‌లోని మాగంటి గోపీనాథ్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించిన అనంతరం, తీవ్ర విషాదంలో ఉన్న గోపీనాథ్ కుటుంబ సభ్యులను లోకేశ్, బ్రాహ్మణి దంపతులు పరామర్శించారు. వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా లోకేశ్ పక్కనే కూర్చున్నారు.

తరువాయి 2లో



## ముగిసిన మాగంటి అంత్యక్రియలు.. పాడె మోసిన కేటీఆర్, హరీశ్ రావు

బీఆర్ఎస్ పార్టీ నేత, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ (62) అంత్యక్రియలు ముగిశాయి. ఆదివారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ప్రభుత్వ అధికారిక లాంఛనాల మధ్య మాగంటి అంత్యక్రియలు నిర్వహించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఆదివారం ఉదయం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతితో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మాగంటి గోపీనాథ్ అంతిమ సంస్కారాలు కన్నీటి వీడ్కోలు నడుమ జరిగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు తుది నివాళులర్పించారు. అంతకుముందు జరిగిన అంతిమయాత్రలో కేటీఆర్, హరీశ్ రావు తదితరులు పాడె మోశారు. పోలీసులు మాగంటి భౌతికకాయానికి గౌరవ వందనం సమర్పించారు. గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి అధికారిక లాంఛనాలను పూర్తి చేశారు. మాగంటి గోపీనాథ్ గత మూడు రోజులుగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఈ నెల 5న ఇంట్లో ఉన్న సమయంలో ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, ఆయన కార్డియాక్ అరెస్ట్‌కు గురైనట్లు నిర్ధారించారు. వెంటనే సీపీఆర్ చేయడంతో గుండె స్పందించింది. అనంతరం నాడీ, రక్తపోటు సాధారణ స్థితికి రావడంతో ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. అయితే, మాగంటి గోపీనాథ్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో కూడా పోరాడుతున్నారు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం ఆయన ఏఐజీ ఆసుపత్రిలోనే చేరి డయాలసిస్ చేయించుకున్నట్లు సమాచారం. గుండెపోటుతో మూడు రోజులుగా చికిత్స పొందుతున్నప్పటికీ, ఆయన ఆరోగ్యం విషమించడంతో ఆదివారం ఉదయం 5:45 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారని వైద్యులు తెలిపారు. ఆయన ఆకస్మిక మరణం పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

## "వేశ్యలు" అంటూ చేసిన ఈ వ్యాఖ్యలను ఉపేక్షించే పరిస్థితే లేదు: సీఎం

(మొదటిపేజీ తరువాయి)

అంటూ చేసిన దారుణమైన వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ, మీడియా ముసుగులో సాగుతున్న ఇలాంటి వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. "తన సొంత మీడియా చానల్ ద్వారా జరిగిన ఈ దారుణాన్ని ఒక మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇప్పటికీ ఖండించకపోవడం, స్త్రీ జాతికి క్షమాపణ చెప్పకపోవడం మరింత విచారకరం. ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి మనది. స్త్రీమూర్తులను ఆరాధించే సమాజం మనది. ఇది మన సంప్రదాయం. మన భారతీయ జీవన విధానం. ముఖ్యంగా మన తెలుగు ప్రజల విషయానికి వస్తే ఆడబిడ్డను, అమ్మను ఎంతో ఆదరణతో చూస్తాం. అలాంటి మన రాష్ట్రంలో రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా ఏకంగా మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం. వాళ్లు ఎప్పుడూ అనుసరించే ఈ విష సంస్కృతిపై తిరుగుబాటుగా గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చినా వారి వైఖరిలో మార్పు రాలేదనేది సుస్పష్టం. రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టు దాటి మహిళల మనోభావాలను గాయపరచిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటాం. గత విధ్వంస ప్రభుత్వం పై రాజధాని మహిళల పోరాటాన్ని మనసులో పెట్టుకుని ఆ ప్రాంత మహిళలపై ఉద్దేశ్యపూర్వకంగా, నీచాతినీచంగా చేసిన ఈ వ్యాఖ్యలు మొత్తం మహిళా సమాజాన్నే అవమానించడం. మహిళలను గౌరవించే, వారి ఆత్మగౌరవానికి అండగా నిలిచే కూటమి ప్రభుత్వం ఈ నీచ సంస్కృతికి చెక్ పెట్టే బాధ్యత తీసుకుంటుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి నారా లోకేశ్

అనంతరం, నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా మాగంటి గోపీనాథ్ మృతి పట్ల తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. "జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గారు గుండెపోటుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అకాల మరణం పొందడం దిగ్భ్రాంతికి గురిచేసింది, ఇది చాలా బాధాకరం" అని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీతో మాగంటి గోపీనాథ్‌కు ఉన్న అనుబంధాన్ని లోకేశ్ సోషల్ మీడియా వేదికగా గుర్తుచేసుకున్నారు. "తెలుగుదేశం పార్టీతోనే మాగంటి గోపీనాథ్ గారి రాజకీయ ప్రస్థానం మొదలైంది. 1982లో తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయన, 1985లో హైదరాబాద్ నగర తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేశారు. 2014లో తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు" అని లోకేశ్ తెలిపారు. ఎమ్మెల్యేగా వరుసగా మూడు సార్లు విజయం సాధించి, నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. "వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. మాగంటి గోపీనాథ్ గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అంటూ లోకేశ్ తన సంతాప సందేశంలో వెల్లడించారు.



## కాళేశ్వరం కమిషన్ విచారణపై ఈటల సంచలన వ్యాఖ్యలు

* **కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం తనకేంటని ప్రశ్న**
* **కేబినెట్ లో చర్చించకుండా ప్రభుత్వంలో ఏమీ జరగదని వెల్లడి**
* **తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యలను తిప్పికొట్టిన ఈటల**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం తనకు లేదని బీజేపీ నేత, తెలంగాణ మాజీ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరైన ఈటల.. కేసీఆర్ ను రక్షించేందుకే వాస్తవాలను దాచిపెట్టారన్న ఆరోపణలపై మాజీ మంత్రి స్పందించారు. ఆదివారం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినపుడు ఆర్థిక మంత్రిగా ఉన్నానని, ఆ సమయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, వాటిలో తన పాత్రను కమిషన్ ముందు వెల్లడించినట్లు చెప్పారు. ఈ విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కాంగ్రెస్ నేతలు ఇలాంటి కామెంట్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గ ఉపసంఘం లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టే లేదని తెలిపారు. కాళేశ్వరంలోని అనేక ప్రాజెక్టుల రీడిజైనింగ్ను కేబినెట్ సబ్ కమిటీ సూచించింది. త్వరలోనే అన్ని జీవోలు, సబ్ కమిటీ నిర్ణయాలు, సూచనలు బయటపెడతా అని చెప్పారు.



**మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై..**

కాళేశ్వరం ప్రాజెక్టు అంశం అసలు కేబినెట్ ముందుకే రాలేదంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను ఈటల రాజేందర్ కొట్టిపారేశారు. కేబినెట్లో చర్చించకుండా ప్రభుత్వంలో ఏదీ జరగదని గుర్తుచేశారు. అలాంటిది కాళేశ్వరం ప్రాజెక్టుపై కేబినెట్ చర్చించలేదనడం సరికాదని అన్నారు. ప్రాజెక్టు విషయంలో తీసుకున్న ప్రతీ నిర్ణయంపై కేసీఆర్ అందరితో సంతకాలు తీసుకున్నారని చెప్పారు. ఈ విషయం అప్పటి మంత్రులు తుమ్మల, జూపల్లి, కడియం శ్రీహరిలకు కూడా తెలుసని అన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

## పాస్ వర్డ్ లు ఇక వద్దు... యూజర్లకు గూగుల్ అలర్ట్!



ఆన్‌లైన్ భద్రత విషయంలో పాతకాలపు పద్ధతులకు స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైందని టెక్ దిగ్గజం గూగుల్ గట్టిగా చెబుతోంది. ముఖ్యంగా, మనమందరం రోజూ వాడే జీమెయిల్ వంటి కీలక ఖాతాల రక్షణకు పాస్‌వర్డ్‌లు, టూఫ్యాక్టర్ అథెంటికేషన్ (2FA) వంటి వాటికి బదులుగా పాస్‌కీలు, 'సైన్ ఇన్ విత్ గూగుల్' వంటి సోషల్ సైన్‌ఇన్‌లను వినియోగించడం అత్యంత ఉత్తమమని గూగుల్ తాజాగా స్పష్టం చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) విస్తృతితో సైబర్ నేరగాళ్లు మరింత రెచ్చిపోతున్నారని, దీని ఫలితంగా 61 శాతం మంది ఈమెయిల్ యూజర్లు ఏదో ఒక రూపంలో దాడులకు గురవుతున్నారని గూగుల్ ఆందోళన వ్యక్తం చేసింది. "పాస్‌వర్డ్‌లను గుర్తుంచుకోవడం, వాటిని సురక్షితంగా నిర్వహించడం చాలా కష్టమైన పని" అని కంపెనీ పేర్కొంది. దీనివల్ల అవి సులభంగా ఫిషింగ్ దాడులకు లక్ష్యమవుతాయని, తరచూ జరిగే డేటా ఉల్లంఘనల ద్వారా బయటకు పొక్కుతాయని హెచ్చరించింది. అందుకే, "మీ ఖాతాను ఆటోమేటిక్‌గా సురక్షితంగా ఉంచే, మోసాల నుండి మిమ్మల్ని కాపాడే ఆధునిక సాధనాలను ఉపయోగించడం చాలా ముఖ్యం" అని గూగుల్ నొక్కి చెప్పింది.

* **పాస్‌కీలతో పటిష్ట భద్రత**

పాస్‌కీలు అనేవి మన స్మార్ట్‌ఫోన్ వంటి విశ్వసనీయ పరికరాల ద్వారా బయోమెట్రిక్ (వేలిముద్ర, ముఖ గుర్తింపు) లేదా పిన్/ప్యాటర్న్ లాక్ విధానాలతో పాస్‌వర్డ్‌ల అవసరం లేకుండా లాగిన్ అయ్యే వ్యవస్థ. ఇవి ఫిషింగ్ దాడులను అత్యంత సమర్థవంతంగా అడ్డుకోగలవని గూగుల్ భరోసా ఇస్తోంది. అంటే, ఇకపై క్లిష్టమైన పాస్‌వర్డ్‌లను గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం గానీ, వాటిని దొంగిలిస్తారన్న భయం గానీ ఉండదు. యువతరం (జెనరేషన్ Z) ఇప్పటికే పాస్‌కీలు, సోషల్ సైన్‌ఇన్‌ల వైపు మొగ్గుచూపుతుండగా, పాత తరం వారు ఇంకా సంప్రదాయ పద్ధతులనే అనుసరిస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, మే 1న ప్రపంచ పాస్‌వర్డ్ దినోత్సవం సందర్భంగా కూడా, "మీరు మీ పాస్‌వర్డ్‌ను గుర్తుంచుకోవడానికి లేదా రీసెట్ చేయడానికి బదులు పాస్‌కీతో సురక్షితంగా సైన్ ఇన్ చేయవచ్చు" అని గూగుల్ తన అధికారిక ఎక్స్ (గతంలో ట్విట్టర్) ఖాతాలో ఉద్ఘాటించింది. ఇటీవలే ఇన్‌స్టాగ్రామ్ అధినేత ఆడమ్ మోసెరీ సైతం తాను ఒక సరికొత్త ఫిషింగ్ దాడి నుంచి తృటిలో తప్పించుకున్నట్లు వెల్లడించడం గూగుల్ హెచ్చరికలకు బలం చేకూరుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో, యూజర్లు తమ ఆన్‌లైన్ ఖాతాల భద్రతపై మరింత అప్రమత్తంగా ఉంటూ, పాస్‌కీల వంటి నూతన సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## బలూచిస్థాన్ లో పాక్ కొత్త చట్టం... సైన్యానికి మరింత పవర్!

* **బలోచిస్థాన్‌లో వివాదాస్పద ఉగ్రవాద వ్యతిరేక సవరణ చట్టం 2025 ఆమోదం**
* **ఆరోపణలు లేకున్నా 90 రోజుల నిర్బంధానికి సైన్యానికి, నిఘా సంస్థలకు అధికారం**
* **ముందస్తు అనుమతులు లేకుండానే సోదాలు, అరెస్టులకు వీలు**
* **పౌర హక్కుల ఉల్లంఘనేనంటూ అంతర్జాతీయ సంస్థల తీవ్ర ఆందోళన**
* **ఈ చట్టం బలూచ్ పౌరులే లక్ష్యంగా తెచ్చిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి**
* **గతంలో రహస్యంగా జరిగిన చర్యలకు ఇప్పుడు చట్టబద్ధత కల్పించారని ఆరోపణ**

పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్‌లో వేర్పాటువాద ఉద్యమాన్ని నియంత్రించేందుకు అక్కడి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తరచూ వివాదాస్పదమవుతున్నాయి. తాజాగా, బలోచిస్థాన్ అసెంబ్లీ ఆమోదించిన ఉగ్రవాద వ్యతిరేక (సవరణ) చట్టం 2025, స్థానికంగా తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. పౌరులు, మానవ హక్కుల సంఘాలు ఈ చట్టంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**చట్టంలోని వివాదాస్పద అంశాలు**

బలూచ్ పౌరులను లక్ష్యంగా చేసుకుని ఈ చట్టాన్ని రూపొందించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కొత్త నిబంధనల ప్రకారం, ఎటువంటి నేరారోపణలు లేదా కేసులు నమోదు కాకపోయినా, కేవలం అనుమానం ఆధారంగా వ్యక్తులను అదుపులోకి తీసుకునే అధికారం పాకిస్థాన్ సైన్యానికి, నిఘా సంస్థలకు దఖలుపడుతుంది. అరెస్టు చేసిన వారిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టకుండానే 90 రోజుల వరకు నిర్బంధంలో ఉంచవచ్చు. అంతేకాకుండా, కోర్టుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే సోదాలు నిర్వహించడానికి, వస్తువులు స్వాధీనం చేసుకోవడానికి, వ్యక్తులను నిర్బంధించడానికి అవసరమైన ఆదేశాలు జారీ చేసేందుకు పోలీసు, నిఘా సంస్థల అధికారులతో కూడిన సంయుక్త దర్యాప్తు బృందాలకు (జేఐటీ) ఈ చట్టం అధికారం కల్పిస్తోంది. కేవలం 'అనుమానం' ఆధారంగా అరెస్టులు చేసే వెసులుబాటు కల్పించడం పట్ల పౌర సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.



# జవాన్ కప్ విజేత భద్రాద్రి పోలీస్ జట్టు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మీడియా ఎలెవన్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ప్రకాశం స్టేడియంలో జరుగుతున్న జవాన్ కప్ క్రికెట్ టోర్నమెంట్ లో పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో సింగరేణి టీమ్ పై 75 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన సింగరేణి తొలుత బౌలింగ్ ఎంచుకుంది... నిర్ణీత 18 ఓవర్లలో పోలీస్ టీమ్ 7 వికెట్ ల నష్టానికి 175 పరుగులు సాధించింది.ఆ జట్టులో బాల, హనుమంతు చెరో 44 పరుగులు భారీ స్కోరుకు బాటలు వేసారు.. సింగరేణి టీమ్ బౌలర్ లు రాంబాబు 3, అరూప్, శివ రెండు వికెట్లు సాధించారు. లక్ష్య చేదనకు బరి లోకి దిగిన సింగరేణి ఆదిలోనే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది... చివరికి 16 ఓవర్లలో 100 పరుగులు మాత్రమే సాధించి పరాజయం పాలైంది... మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గా ట్రాఫిక్ ఎస్ ఐ నరేష్ రుద్ర ఎంపికయ్యారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ రవి కుమార్, డీఎస్పీ రెహ్మాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే షాబిర్ పాషా, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ 1 టౌన్ 3 టౌన్ సి ఐ లు కరుణాకర్, శివ ప్రసాద్, సింగరేణి స్పోర్ట్ అధికారి పాలడుగు శ్రీనివాస్, టీ యూ డబ్ల్యూ జే జిల్లా అధ్యక్షులు ఇమ్మంది ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.. అనంతరం మాజీ సైనికులకు ఘనంగా సన్మానించారు.. ఈ సందర్భంగా మొదటి విజేత కు లభించే 30000 తో పాటు మొత్తం 70000 సైనికుల సంక్షేమ నిధికి జమ చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కేంద్ర మంత్రి



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకల్లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. మండలంలోని గూడెంలో గల మహేశ్వర గార్డెన్‌లో జరిగిన బెదుర అరుణ్ సోదరి జ్యోత్స్న వివాహ వేడుకల్లో, ఎఎంఆర్ గార్డెన్‌లో జరిగిన కొండాపూర్ బిజెపి కార్యకర్త భగత్ వివాహ వేడుకల్లో, నామాపూర్ గ్రామంలో బిజెపి నాయకుడు మెరుగు అంజాగౌడ్ కూతురు అల్లుడ్ని, చీకోడ్ గ్రామంలో జరిగిన కరెడ్ల మల్లారెడ్డి కూతురు నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొని, ఆశీర్వదించారు. కేంద్ర మంత్రి వెంట పలువురు బిజెపి నాయకులున్నారు.

## ప్రదాని మోదీని కలిసిన జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యురాలు విజయభారతి



ప్రజాస్ఫూర్తి, కాప్రా: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీని నేతాజీ నగర్ కు చెందిన జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యులు విజయభారతి ఆమె కుటుంబసభ్యులు న్యూ ఢిల్లీ లో ప్రధాని అధికారిక నివాసంలో కలిశారు. విజయభారతి కుమారుడు, స్థానిక దంతవైద్యులు డా అరవింద్ కోడలు డాక్టర్ ఆశా కలిశారు. ప్రధాని మోదీ కి జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యులు విజయభారతి సభ్యులను మోడీకి పరిచయం చేశారు. అనంతరం పిఎం మోడీ అందరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద్ తాము ఓ రాయల్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అనే ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి తెలియచేసారు. దేశంలో సామాన్య ప్రజానీకానికి దంతవైద్యాన్ని అందుబాటులో తీసుకురావాలని, అందుకు అనుగుణంగా దంతవైద్యానికి పూర్తి స్థాయిలో ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని ఓ రాయల్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా తరపున వినతి పత్రాన్ని అంద చేశారు.. దానికి ప్రధాని సానుకూలంగా స్పందించారని డాక్టర్ అరవింద్ తెలియచేశారు.

## ఆ విషయంలో నేను కర్ణాటక, ఆంధ్రకూ.. అండగా నిలుస్తా: కమల్ హాసన్

మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ భాషా వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తాజాగా జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. పాఠశాలల్లో ఒక నిర్దిష్టమైన భాషను విద్యార్థులపై బలవంతంగా రుద్దడం వల్ల అభ్యాస ప్రక్రియకు ఆటంకం కలుగుతుందని కమల్ అన్నారు. ఈ విషయంలో తాను కేవలం తమిళనాడుకు మాత్రమే కాకుండా పంజాబ్‌కు, కర్ణాటకకు, ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలుస్తానని అన్నారు. కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకురావడాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. "చదువు విషయంలో విద్యార్థులకు ఎటువంటి అడ్డంకులు సృష్టించకూడదు. ఒక భాషను తప్పనిసరిగా నేర్చుకోవాలి అంటే స్పానిష్, చైనీస్ ఏదైనా నేర్చుకోవచ్చు. దేశంలో ఎన్నో ఏళ్లుగా ఆంగ్ల విద్య స్థిరంగా కొనసాగుతోంది. దానిని ఒక్కసారిగా భర్తీ చేయాలనుకుంటే ఆ ప్రభావం విద్యార్థులపై పడుతుంది. మాపై హిందీని బలవంతంగా రుద్దితే మరి మా మాతృ భాష ఏమవ్వాలి? దేశంలో ఉన్న 22 అధికారిక భాషల్లో తమిళం ఒకటి కాదా?" అని కమల్ ప్రశ్నించారు.

## జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం

* టీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య



ప్రజాస్ఫూర్తి, కాప్రా : జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడేది టీడబ్ల్యూజేఎఫ్ సంఘం మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవ పున్నయ్య అన్నారు. ఆదివారం ఉప్పల్ నియోజకవర్గం లో టిడబ్ల్యూ జెఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి బి బసవపునయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా బసవపున్నయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల కనీస సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కొత్త సంవత్సరం వచ్చి ఆరు నెలలు కావస్తున్న అక్రిడిటేషన్ కార్డులకు ఇంకా స్టికర్లు వేస్తూ కాలం వెళ్ళదీస్తున్నారని అన్నారు. పేరుకు హెల్త్ కార్డులు ఇచ్చారని, అవి పనిచేయడం లేదని చెప్పారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు తదితర సమస్యలపై సంఘం అవిశ్రాంత ఉద్యమాలు చేస్తున్నదని గుర్తు చేశారు. ప్రస్తుతం జర్నలిస్టులు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని అభిప్రాయపడ్డారు. అలాగే చిన్న పత్రికల పరిస్థితి మరీ దారుణంగా ఉందని వివరాయించారు. సంఘ సభ్యులందరూ కూడా ఐక్యమత్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత జాప్యం చేయడం తగదని, దీర్ఘకాళికంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బి బసవ పున్నయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా..జర్నలిస్టుల సమస్యలను ఇంత వరకు పరిష్కరించలేదని అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ, సమస్యల పై సమిష్టి పోరాటానికి జర్నలిస్టులు సన్నద్దం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎంపల్లి పద్మా రెడ్డి, టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి హరిప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పటేల్ నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షులు రోజా రాణి, ఉప్పల్ కార్యదర్శి వి రామచంద్రమూర్తి, నాయకులు డి శ్రీనివాసరావు, డి కిరణ్ కుమార్ రావు, వెంకట్, కీర్తి శ్రీనివాస్, ఎన్ శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవ శోభాయాత్ర



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : 352 వ హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతి నగర్ లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం (ఆర్ ఎస్ ఎస్) పిలుపుమేరకు వివిధ హిందూ సంఘాలు నిర్వహించిన శోభాయాత్ర లో అశేషంగా హిందువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశంలో హిందువులందరూ అరబ్, మొగల్ మతోన్మాద ఇస్లాం పాలకుల దారుణాలకు దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు ఒక ఆశాకిరణంలా జన్మించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ హిందూ మహా సామ్రాజ్య పట్టాభిషిక్తుడైన జ్యేష్ట శుద్ధ త్రయోదశి రోజును మన దేశమంతా హిందూ సామ్రాజ్య దినోత్సవంగా వైభవంగా ప్రతి సంవత్సరం జరుపుకుంటామన్నారు. ఈ శోభాయాత్ర ప్రగతి నగర్ కోతి బొమ్మల సెంటర్ నుంచి వివిధ రహదారుల గుండా జరిగింది. ఈ శోభాయాత్రలో వివిధసంస్థలు, పార్టీలకు చెందిన డాక్టర్ ఎమ్ ఆర్ ఎస్ రాజు, మధు జీ, కంతేటి సుబ్బారావు, సత్య కాటేపల్లి, రచ్చ చక్రధర్, లక్ష్మీ రామారావు, బిక్షపతి యాదవ్, శేషారావు, నరేంద్ర చౌదరి, శ్రీనివాస్ గుప్తా, దాసి నాగరాజు, సుమన్ రావు, కిశోర్, వెంకటేశ్, కౌశిక్ నాయుడు, లింగారెడ్డి, వినీత్, అశోక్, భారతి, శిల్ప, కల్యాణి, సూర్య నారాయణ, డాక్టర్ వెంకన్న, జనార్ధన్ రెడ్డి, మధుసూదన్, రాజశేఖర్ రెడ్డి, బాలాజీ నాయక్, భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చదువు జీవితాన్ని వెలిగించే దీపం

* గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు
* డి.ఎస్.పి అబ్దుల్లారెహమాన్



ప్రజా స్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణంలో గల జిల్లా గ్రంథాలయం నందు సీనియర్ సిటిజన్స్ విద్యానగర్ కాలనీ వారి ఆధ్వర్యంలో పదివేల రూపాయలు విలువ చేసే సాధారణ వేడి , చల్లని , త్రాగునీరు అందించే వాటర్ కూలర్ ను జిల్లా గ్రంథాలయానికి డి.ఎస్.పి ఆర్ఎస్ రెహమాన్ ఆధ్వర్యంలో అందజేశారు . ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ చదువు జీవితాలని వెలిగించే చక్కటి దీపం అని, సామాన్య కుటుంబాన్ని సంపన్న కుటుంబంగా తీర్చిదిద్దుతుందని ఆయన అంటూ కష్టపడి, ఇబ్బందులను ఓర్చుకుని మంచిగా చదువుకున్న వారు నేడు ఉన్నత స్థానాల్లో నిలిచారని చెప్పారు. నేటి రోజుల్లో చదువుకునేందుకు ప్రభుత్వాలు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాయని, కనీస మౌలిక సదుపాయాలు లేని రోజుల్లో వీధి దీపాలు కిరోసిన్ లాంతర్ల ముందు కూర్చుని చదువులు సాగించారని చెప్పుకొచ్చారు.విద్యార్థులు ఓ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని చదివిన నాడు లక్ష్యం సహకారం అవుతుంది, కృషి పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు వంటివనీ, వాటిని సద్వినియోగం చేసుకొని మంచి వాతావరణంలో చదువుకోవాలని సూచించారు. గ్రంథాలయాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు సదుపాయాలు కల్పిస్తుందని మెరుగైన సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. విశ్రాంత ఉద్యోగులు తమకు వచ్చే నెలవారి పింఛన్లలో మంచి సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రంథాలయాల్లో ఉన్న అవసరాలను గుర్తించి వాటిని సమకూర్చేందుకు ముందుకు రావడం గర్వకారణం అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బ్రతుకులను బంగారు మయంగా మలుచుకోవాలని, మన ప్రవర్తన ఆధారంగానే జీవితాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు జి మణి మృదుల సీనియర్ సిటిజెన్ సభ్యులు ప్రెసిడెంట్ కోట్ల నాగేశ్వరరావు, సెక్రటరీ సురేష్ కుమార్ ట్రెజరర్ ధర్మరాజు, కేశవరావు, విద్యార్థిని విద్యార్థులు పాఠకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బాధిత కుటుంబానికి రూ.కోటి బీమా పరిహారం అందించిన ఎస్‌బీఐ




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఇటీవల మణుగూరు ఓపెన్‌కాస్టులో ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో మరణించిన టెక్నికల్ ఆపరేటర్ ముల్చంద్ కుటుంబానికి ఎస్‌బీఐ ప్రమాద బీమా పరిహారాన్ని అందించింది. ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ వెంకటశ్వర్లు, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ చేతులమీదుగా రూ. 1 కోటి విలువ చేసే చెక్కును మృతుని భార్య, నామినీ హరిదేవి విశ్వకర్మకు అందించారు. కార్పొరేట్ జీతం ప్యాకేజీ పథకం కింద సింగరేణి ఉద్యోగులకు ప్రమాదబీమా వర్తింప చేస్తున్నట్లు సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ బలరాం, ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి, సీజీఎం రాధాకృష్ణ, జీఎం ప్రకాశ్ చంద్ర, డీజీఎం ఘనశ్యాంలకు మృతుని నార్య హరిదేవి, కార్మిక సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## జవాన్ కప్ టీం క్రీడాకారులతో మొక్కలు నాటించిన నైనిక రజువా




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మీడియా ఎలెవెన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో గత నాలుగు రోజులుగా కొనసాగిన జవాన్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో పోలీస్ జట్టు విజేతగా నిలువగా, రన్నరప్‌గా సింగరేణి జట్టు నిలిచింది. కాగా టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన జట్లతోపాటు పోటీల నిర్వాహకులచే మొక్కల రాజశేఖర్ ఆధ్వర్యంలో హరితదీక్ష చేపట్టిన నైనిక రజువా మొక్కలు నాటించారు. ప్రకాశం స్టేడియం ఆవరణలో మొక్కలు నాటించిన సందర్భంగా ఇరు జట్ల సభ్యులు, టోర్నమెంట్ నిర్వాహకులు నైనికను అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారి పాలడుగుల శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సై నరేష్ రుద్ర, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, లక్ష్మణ్ , ఎర్ర కామేష్, మాజీ ఆర్మీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ జిల్లాపరిషత్ ఛైర్మెన్ మృతి



జిన్నారం, ప్రజాస్ఫూర్తి 08: మాజీ జిల్లాపరిషత్ ఛైర్మెన్ డి.రామకృష్ణ మృతిచెందారు. తెలుగుదేశం పార్టీ హయంలో జిల్లాపరిషత్ ఛైర్మెన్ గా పనిచేశారు. ఆయన స్వస్థలం జిన్నారం మండలం ఖాజిపల్లి కాగా ఆయన గత కొన్ని సంవత్సరాలుగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. టీడీపీ హయాంలో పదవి చేయగా అనంతరం ఆయన కాసాని జ్ఞానేశ్వర్ వెంట బిసి ఐక్యవేదికలో ఉన్నారు. అనంతరం కొంతకాలంగా మొత్తం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆయన మృతి పట్ల జిన్నారం మండల ప్రజలు సంతాపం తెలిపారు .

# రామోజీరావు వర్ధంతి, మాగంటి గోపీనాథ్ మృతికి కాప్రా ప్రెస్ క్లబ్ ఘన నివాళులు..

ప్రజాస్ఫూర్తి, కాప్రా : ప్రఖ్యాత మీడియా వ్యవస్థాపకులు, జర్నలిజం పితామహులు రామోజీరావు మృతికి నేటితో ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా కాప్రా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదివారం ఈసీఐఎల్ లోనే ప్రెస్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశం లో ప్రెస్ క్లబ్ సభ్యులు, ప్రముఖ స్థానిక జర్నలిస్టులు, రచయితలు తదితరులు పాల్గొని, రామోజీరావు జీవిత సేవలను, ఆయన తెలుగు మీడియా రంగంలో తీసుకొచ్చిన మార్పులు, నూతన దిశను గురించి పాల్గొన్నవారు పేర్కొన్నారు. ఆయన జర్నలిజం పట్ల ఉన్న అంకితభావం, ప్రజల పక్షాన నిలిచే తత్త్వం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని వారు భావావేశంతో తెలిపారు. అనంతరం రామోజీరావు స్మృతిలో మౌనం పాటించి, పుష్పాంజలి ఘటించారు. ఆదివారం ఉదయం మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు కూడా సభలో సంతాపం తెలిపారు. వరుసగా మూడుసార్లు



ప్రజల మద్దతుతో గెలుపొందిన ఆయన సేవలను గుర్తు చేస్తూ పలువురు జర్నలిస్టులు నివాళులర్పించారు. మాగంటి కుటుంబానికి కాప్రా ప్రెస్ క్లబ్ తరపున సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పటేల్ నర్సింహులు, కార్యదర్శి డి.కిరణ్ కుమార్ రావు, సీనియర్ జర్నలిస్టులు ఎంపల్లి పద్మారెడ్డి, వెంకట్, గుమ్మడి హరిప్రసాద్, కీర్తి శ్రీనివాస్, జి.రోజారాణి, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పాల సొసైటీ చైర్మన్ గాల్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేట మండలం చల్లూరు గ్రామంలో మదర్ డెయిరీ ఆద్వర్యంలో అన్నదాత పాల సొసైటీ ఎన్నికలు ఆదివారం జరుగగా చైర్మన్ గా అరుకాల గాల్ రెడ్డి 26 వ, సారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మీస బాల మల్లయ్య తెలిపారు. డైరెక్టర్లుగా గాల్ రెడ్డి, వర్కల అజయ్ కుమార్ లు ఎన్నికైనట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు యాదగిరి రెడ్డి, రాజి రెడ్డి, కృష్ణ, రాములు, లక్ష్మి, కిష్టయ్య, తిరుపతి, మల్లేశం , పాల ఉత్పత్తి దారులు, సొసైటీ వేతన కార్యదర్శి బీమగాని మధు లు పాల్గొన్నారు. గాల్ రెడ్డిని పలువురు సత్కరించారు.

## 25 ఏళ్ల తర్వాత మక్తల్ కు మంత్రి పదవి

* **ముదిరాజ్ కోటాలో వాకిటి శ్రీహరికి మినిస్ట్రీ..**
* **జై మక్తల్ ట్రస్ట్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు... చైర్మన్ సందీప్ కుమార్ మక్తల**



యాదాద్రి భువనగిరి ప్రజాస్ఫూర్తి : దాదాపు 25 ఏళ్ల తర్వాత మక్తల్ నియోజకవర్గానికి మంత్రి పదవి దక్కిందని, అది కూడా ముదిరాజ్ కోటాలో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వాకిటి శ్రీహరి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో నియోజకవర్గ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారని, జై మక్తల్ ట్రస్ట్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నట్టు చైర్మన్ సందీప్ కుమార్ మక్తల తెలిపారు. దాదాపు 30 ఏళ్లకు పైగా ఒకే పార్టీని నమ్ముకుని రాజకీయ ప్రస్థానం సాగించిన వాకిటి శ్రీహరి ముదిరాజ్... సర్పంచ్ నుంచి మొదలుకొని భార్య ఎంపీటీసీ, జెడ్పిటిసి ,జడ్పీ ఫ్లోర్ లీడర్ ,కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి ,ఎమ్మెల్యే పదవి, తాజాగా మంత్రి పదవిని అలంకరించాలని... ఇలా అంచెలంచలుగా ఎదిగిన వాకిటి శ్రీహరి ముదిరాజ్ కు అభిమానులు జేజేలు పలుకుతున్నారని తెలిపారు.

* **ఇక అభివృద్ధిలో మక్తల్ పరుగులు...**

ఎమ్మెల్యే అయిన వెంటనే తల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన వాకిటి శ్రీహరి... తాజా మంత్రి పదవి కూడా తోడవడంతో అభివృద్ధిలో నియోజకవర్గం ఇక పరుగులు పెడుతుందని సందీప్ కుమార్ మక్తాల ఆశ భావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో ప్రభుత్వ సంస్థలు కానీ, పర్యాటకపరంగా కానీ, పరిశ్రమల పరంగా గాని సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని.. వాటిని దృష్టిలో ఉంచుకొని రాబోయే రోజుల్లో మక్తల్ ను ఇట్ట పర్యాటకపరంగా పారిశ్రామికపరంగా అన్ని రంగాల్లోనూ అత్యున్నత స్థాయిలో నిలబడేందుకు బక్రీద్ చర్యలు తీసుకోవాలని ఎందుకు నియోజకవర్గం పూర్తిగా సహకరిస్తుందని సూచించారు. రాజకీయాలకతీతంగా నియోజవర్గ అభివృద్ధి కోసం అందరూ కలిసి వచ్చి మంత్రి వాకిటి శ్రీహరికి సహకరించాలని కోరారు. 25 ఏళ్ల తర్వాత మొత్తం నియోజవర్గానికి మంత్రి పదవి తగ్గడంతో భారీ స్థాయిలో సంబరాలు చేసుకోవాలని ఇందుకోసం జైమఖ్తల్ ట్రస్ట్ ప్రత్యేక చొరవ తీసుకుంటుందని తెలిపారు. రాబోయే రోజుల్లో వేడుకలకు సంబంధించి పూర్తిస్థాయి సమాచారం అందిస్తామని అన్నారు. మరొకసారి మంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ వాకిటి శ్రీహరి ముదిరాజ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గిరిజన లంబాడ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలి

* **లేకపోతే గాంధీభవన్ కు తాళాలు వేస్తాం....**



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : లంబాడి హక్కుల పోరాట సమితి ఖబర్దార్ పాలకులారా తక్షణమే 12 శాతం జనాభా ఉన్న గిరిజన లంబాడి సామజిక వర్గానికి మంత్రి పదవి కల్పించాల0టూ రాజాపేట మండల లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు భూక్యా శ్రీకాంత్ నాయక్ హెచ్చరించారు. ఆదివారం ఆయన రాజపేటలో విలేకరులతో మాట్లాడారు. రాష్టంలో ప్రజాపాలనా ప్రభుత్వన్ని ఏర్పాటు చేయడాన్ని లంబాడి సామజిక వర్గం 45 నియోజకవర్గలపైగా ఓట్లు వేసి గెలిపించి ముఖ్యమంత్రి పదవిలో రేవంత్ రెడ్డి ని కూర్చోపెట్టామని, లంబాడి సామజిక వర్గానికి మంత్రి పదవి దక్కకపోవడం అన్యాయమే అన్నారు. రాంచంద్రం నాయక్ కి డిప్యూటీ స్పీకర్ లాంటి అధికారం లేని పదవులు ఇచ్చి చేతులు దులుపుకుంటే లంబాడి సామజిక వర్గానికి ఏ మాత్రం న్యాయం కాదని, రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అంటే బంజారా ఎన్నో కార్యక్రమాలల్లో మాట్లాడగా, ప్రజాపాలనా ఏర్పడ్డాక లంబాడి సామజిక వర్గానికి ఏ మాత్రం న్యాయం జరగట్లేదని ఆరపించారు. తక్షణమే బంజారాలను మంత్రి పదవి కల్పించాలని, లేకపోతే లంబాడా వస్త్రాధారణాలతో వచ్చి ఏఐసీసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని,గాంధీ భవన్ గేట్లకు తాళాలు వేసి రాజ్ భవన్ కార్యక్రమాలకు అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజేందర్ , విజయ్ లు పాల్గొన్నారు.

## 270 ఏళ్ల తర్వాత అనంతపద్మనాభస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం



తిరువనంతపురం: కేరళలోని ప్రఖ్యాత అనంతపద్మనాభ స్వామి ఆలయ పరిసరాలు 'నారాయణ' మంత్రంతో మార్మోగాయి. సుమారు 270 ఏళ్ల తర్వాత తొలిసారిగా జరిగిన మహా కుంభాభిషేకంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. సుదీర్ఘంగా జరిగిన ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తయిన నేపథ్యంలో గర్భగుడి శిఖరంపై మూడు కలశాలను ప్రతిష్ఠించారు. అనంతరం విశ్వక్సేనుడి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. ఈ విగ్రహం 300 ఏళ్ల క్రితం నాటిది. 'కటు సర్కార యోగం' విధానంలో దీనిని తయారు చేశారు. ప్రధాన ఆలయ ఆవరణలోని తిరువంబడి శ్రీ కృష్ణ ఆలయం వద్ద అష్టబంధ కలశాన్ని ప్రతిష్ఠించారు. అంతకుముందు ట్రావెన్ కోర్ సంస్థానానికి చెందిన మూలమ్ తిరునాల్ రామ వర్మ కుటుంబ సభ్యులు ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశ ప్రతిష్ఠాపనకు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లారు. కేరళ గవర్నర్ విశ్వనాథ్ రాజేంద్ర అలేఖర్ హాజరై.. ఈ అపురూప ఘట్టాన్ని చివరి దాకా వీక్షించారు. ఆధ్యాత్మిక శక్తిని బలోపేతం చేయడం, ఆలయ పరిసరాలను మరింత పవిత్రం చేయడమే ఈ మహాకుంభాభిషేకం లక్ష్యమని ఆలయ అధికారులు తెలిపారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఇలాంటి క్రతువు నిర్వహించడం 270 ఏళ్లలో తొలిసారి అని చెప్పారు. పద్మనాభస్వామి ఆలయం పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశిస్తూ 2017లో సుప్రీం కోర్టు ఓ కమిటీని ఏర్పాటు చేసింది. పనులు ప్రారంభమైనప్పటికీ... కొవిడ్ కారణంగా వేగంగా ముందుకు సాగలేదు. 2021 తర్వాత వివిధ దశల్లో పనులను పూర్తి చేశారు.

## బిహార్‌లో పోటీ చేస్తా

**: చిరాగ్ పాశ్వాన్**

దిల్లీ: లోక్ జన్‌శక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసి.. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారంటూ కొంతకాలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే.. దీనిపై ఇటీవల ఎదురైన ప్రశ్నలకు ఆయన సరైన సమాధానం ఇవ్వలేదు. తాజాగా ఈ అంశంపై క్లారిటీ ఇచ్చారు. ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో జరిగిన పార్టీ ర్యాలీలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ''బిహార్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తాను. నా రాష్ట్ర ప్రజల కోసం ఇది తప్పకుండా చేస్తాను. నేను రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడిని. ఆయన కలల్ని సాకారం చేసేందుకు



పాటు పడతాను. బిహార్ ప్రజల అభివృద్ధికే నా తొలి ప్రాధాన్యం. ఎన్నికల్లో నేను ఏ స్థానం నుంచి పోటీ చేయాలనేది ప్రజలే నిర్ణయిస్తారు. నేను ఏ నిర్ణయం తీసుకున్నా అది ప్రజల హితం కోసమే'' అని చిరాగ్ పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ప్రతిపాదనను అధికారికంగా ప్రకటించేందుకు లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) యోచిస్తోందని.. అందుకోసం త్వరలోనే కార్యనిర్వాహక సభ్యుల సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## డీఎంకే అవినీతి పుట్ట పెరిగిపోయింది..

## తమిళనాట ఎన్డీఏ అధికారం ఖాయం: అమిత్ షా

చెన్నై: డీఎంకే సారథ్యంలోని కూటమి ప్రభుత్వంపై కేంద్రమంత్రి అమిత్ షా తీవ్ర ఆరోపణలు చేశారు. ఎమ్‌కే. స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే సర్కార్ నాలుగేళ్లుగా అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. మధురైలో ఏర్పాటు చేసిన బహిరంగ ర్యాలీలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వకూటమి అవినీతి పుట్ట పెరిపోయింది. అది తన పరిమితులను దాటేసింది. కేంద్ర ప్రభుత్వం అందించిన రూ.450 కోట్ల పోషకాహార కిట్లను ఒక ప్రైవేట్ కంపెనీకి అప్పగించి భారీ కుంభకోణానికి పాల్పడింది. దీని వల్ల పేదలకు పోషకాహారం అందకుండా చేసింది. రూ.4,600 కోట్ల ఇసుక కుంభకోణానికి పాల్పడింది. దీంతో పేదలు అధిక ధరకు



ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తోంది'' అని షా విరుచుకుపడ్డారు. తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్ (టాస్మాక్) కుంభకోణం గురించి అమిత్ షా ప్రస్తావించారు. ''దీని వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.39 వేల కోట్ల నష్టం వాటిల్లింది. అలా జరగకపోయి ఉంటే ప్రతి పాఠశాలలో అదనంగా రెండు గదులు నిర్మించేందుకు సహాయపడేది. డీఎంకే అవినీతి జాబితా అంతా నా వద్ద ఉంది. కానీ, ఒక్కొక్కటి వివరించేందుకు సమయం సరిపోదు'' అని ఆరోపించారు. మరోవైపు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై కూడా షా తీవ్ర విమర్శలు గుప్పించారు. ''స్టాలిన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైంది. పశ్చిమ బెంగాల్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వచ్చే ఎన్నికల్లో డీఎంకేను ప్రజలు అధికార గద్దె దింపడం ఖాయం. 2026లో జరగనున్న బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో ఎన్డీఏ కచ్చితంగా విజయం సాధిస్తుంది. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది'' అమిత్ షా అని ధీమా వ్యక్తం చేశారు.

## పాకిస్థాన్‌వి ఉత్తర కుమార ప్రగల్భాలే.. ఆధారాలివిగో!

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో తీవ్ర ఆవేదనకు గురైన భారత్.. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. గంటల వ్యవధిలోనే వాటిని నేలమట్టం చేసింది. ప్రతీకారదాడులకు దిగిన పాకిస్థాన్‌ను కూడా చావుదెబ్బ కొట్టింది. అయితే, ఆపరేషన్ సిందూర్ తమపై పెద్దగా ప్రభావం చూపలేదని ప్రపంచ దేశాలను పాకిస్థాన్ నమ్మించే ప్రయత్నం చేసింది. అంతేకాకుండా భారత్‌లోని కీలక సైనికస్థావరాలను ధ్వంసం చేశామని గొప్పలు చెప్పుకుంటోంది. పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో సుఖోయ్ 30ఎంకేఐ యుద్ధవిమానాన్ని ధ్వంసం చేశామని, గుజరాత్‌లోని భుజ్ ఎయిర్‌ఫీల్డ్‌లో ఉన్న ఎస్400 యూనిట్‌ను కూల్చివేశామని చెబుతోంది. అయితే, ఇవన్నీ బడాయి మాటలేనని ఇప్పటికే భారత్ చెప్పింది. తాజాగా, ప్రముఖ ఇమేజరీ అనలిస్ట్ డమియెన్ సైమన్ 'ఎక్స్'లో పోస్టు చేసిన శాటిలైట్ చిత్రాలు.. పాకిస్థాన్‌వి ఉత్తరకుమార ప్రగల్భాలేనని మరోసారి నిరూపించాయి. ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో సుఖోయ్ విమానాన్ని ధ్వంసం చేశామంటూ ఇటీవల పాకిస్థాన్ ఓ చిత్రాన్ని విడుదల చేసిన సంగతి తెలిసిందే.




అయితే, అది ఆపరేషన్ సిందూర్ కంటే ముందే తీసిన చిత్రమని రివ్యూలో తేలింది. అసలు అది సుఖోయ్ యుద్ధవిమానమే కాదు. రోజువారీ మెయింటెనెన్స్‌లో భాగంగా ఎంఐజీ29 ఇంజిన్‌ను శుభ్రం చేస్తున్నప్పటి చిత్రమది. దానిని తనకు అనుకూలంగా మలచుకునేందుకు పాక్ శాయశక్తులా ప్రయత్నించి విఫలమైంది. మరోవైపు.. భుజ్ ఎయిర్‌బేస్‌లోని ఎస్ 400 రేడార్ సిస్టమ్‌ను కుప్పకూల్చినట్లు పాకిస్థాన్ విపరీతమైన ప్రచారం చేసింది. తమ వాదనలకు బలం చేకూరుస్తూ ఓ ఫొటోను కూడా విడుదల చేసింది. ఎయిర్‌బేస్‌లో అక్కడక్కడా నల్లటి మచ్చలు చూపిస్తూ.. అందర్నీ నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే, అవి ఇంధనపు మరకలని రివ్యూలో తేలింది. ఎస్400 అనేది సంచార క్షిపణి వ్యవస్థ. ఒక చోట నుంచి మరో చోటకి తరలించవచ్చు. అలా క్షిపణి వాహనాన్ని తరలిస్తున్నప్పుడు.. దాని నుంచి ఇంధనం లీకై అలా మచ్చలు ఏర్పడినట్లు తేలింది. అంతేకాకుండా భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు చెలరేగడానికి ముందే ఆ చిత్రం తీసినట్లు స్పష్టమైంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌లోని ఆదంపుర్ ఎయిర్ బేస్‌పై దాడి చేసి ఎస్400పై దాడి చేశామంటూ తప్పుడు ప్రచారం చేసింది. అక్కడి ఫొటోను పూర్తిగా మార్ఫింగ్ చేసి.. భారత్ కీలక స్థావరాన్ని ధ్వంసం చేశామని గొప్పలు చెప్పుకొంది.

# మేడిగడ్డ బ్యారేజీలో గల్లంతైన ఆరుగురి మృతదేహాలు లభ్యం





మహదేవ్‌పూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం మేడిగడ్డ బ్యారేజీలో నిన్న గల్లంతైన ఆరుగురి మృతదేహాలను ఆదివారం వెలికితీశారు. రక్షిత్(13), సాగర్ (16), మధుసూదన్ (18), రాంచరణ్ (17), శివ మనోజ్(15), రాహుల్ (19) మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం మహదేవ్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహదేవ్‌పూర్ మండలం అంబట్‌పల్లికి చెందిన గొలుకొండ మల్లయ్య ఇంట్లో రెండ్రోజుల కిందట వివాహం జరిగింది. శుభకార్యానికి హాజరైన బంధువుల్లో ఎనిమిది మంది శనివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో అంబట్‌పల్లి నుంచి ఆటోలో మేడిగడ్డకు చేరుకున్నారు. స్నానం చేసేందుకని తొలుత నదిలో దిగిన పట్టి మధుసూదన్ మునిగిపోతుండటాన్ని గమనించిన ఆయన సోదరుడు పట్టి శివమనోజ్ కాపాడేందుకు యత్నించాడు. ఈ క్రమంలో ఆయన కూడా మునిగిపోయాడు. అలా ఒకరి తర్వాత ఒకరుగా ఆరుగురు అదే ప్రాంతంలో గల్లంతయ్యారు. బాధితుల్లో నలుగురు అంబట్‌పల్లికి చెందిన వారుకాగా, ఇద్దరు కొర్లకుంట గ్రామస్థులని బంధువులు తెలిపారు. ఆటోను నదికి దగ్గర్లో నిలిపి వస్తున్న పట్టి వెంకటస్వామి కళ్లముందే ఆయన ఇద్దరు కుమారులు మధుసూదన్, మనోజ్‌లు గల్లంతవడంతో ఆయన కుప్పకూలారు. గజ ఈతగాళ్ల సాయంతో ఆరుగురి మృతదేహాలను ఆదివారం మధ్యాహ్నం వెలికితీశారు.



## నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపప్రసాదం పంపిణీ

హైదరాబాద్: నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపప్రసాదం పంపిణీని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ప్రారంభించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బత్తిని కుటుంబం చేపప్రసాదం అందజేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలు, ఆస్తమాతో బాధపడుతున్న వారు ఇక్కడికి వచ్చారు.13 కౌంటర్ల ద్వారా బత్తిని కుటుంబం చేపప్రసాదం పంపిణీ చేస్తోంది. ఇక్కడికి వచ్చిన వారి కోసం 42 క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. 2 రోజుల పాటు బత్తిని కుటుంబం పంపిణీ చేయనుంది. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. 70 సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు పంపిణీని పరిశీలించారు.

## రామోజీరావు క్రమశిక్షణ, పట్టుదల, నిజాయితీ స్ఫూర్తిదాయకం: బండి సంజయ్

సిరిసిల్ల: రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్, పద్మవిభూషణ్ రామోజీరావులోని క్రమశిక్షణ, పట్టుదల, నిజాయితీ ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. చంద్రయాన్ సందర్భంగా వారితో మాట్లాడిన క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేనని చెప్పారు. రామోజీరావు వర్ధంతి సందర్భంగా సిరిసిల్లలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రామోజీరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ''చంద్రయాన్‌ను విజయవంతంగా ప్రయోగించిన రోజు



రామోజీ ఫిల్మ్ సిటీలో రామోజీరావుతో దాదాపు 3 గంటలపాటు గడిపిన క్షణాలు ఇంకా నా కళ్ల ముందే మెదులుతున్నాయి. ఆయనను కలిసిన ప్రతిసారి జరిగే చర్చలు ఎంతగా ఆసక్తిగా ఉండేవి. ఆయనలోని నిజాయితీ, క్రమశిక్షణ, దూరదృష్టి, అనుకున్నది సాధించే వరకు పట్టుదలతో వ్యవహరించే తీరు నాకెప్పటికీ స్ఫూర్తిదాయకం. రామోజీరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళి అర్పిస్తున్నా. రామోజీ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన ఆశయాల సాధనలో 'ఈనాడు' గ్రూప్ సంస్థలు మరింత ముందుండాలని కోరుకుంటున్నా. రామోజీ మన మధ్య లేకపోయినా ఆయన స్మృతులు, ఆశయాలు సజీవంగా ఉన్నాయి'' అని బండి సంజయ్ అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. హైదరాబాద్‌కు చేరుకున్న ప్రభాకర్‌రావు



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1గా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు అమెరికా నుంచి ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. సోమవారం సిట్ ఎదుట విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో గత ఏడాది మార్చి 10న ఆయనపై కేసు నమోదైంది. మరుసటి రోజే ప్రభాకర్‌రావు మూడు నెలల కాల పరిమితి వీసాపై అమెరికా వెళ్లి తిరిగి రాలేదు. తాజాగా అమెరికా నుంచి భారత్ వచ్చేందుకు అవసరమైన ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్ (ఈసీ-అత్యవసర పత్రం) జారీ అయింది. దీంతో ఆయన హైదరాబాద్‌కు చేరుకున్నారు.

## బండారు దత్తాత్రేయ ఆటోబయోగ్రఫీ 'ప్రజలకథే నా ఆత్మకథ' ఆవిష్కరణ



హైదరాబాద్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆటోబయోగ్రఫీ 'ప్రజలకథే నా ఆత్మకథ'ను ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆవిష్కరించారు. అనంతరం పుస్తక ప్రతులను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఏపీ సీఎం చంద్రబాబు, విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణకు అందజేశారు. దత్తాత్రేయ తన 70 ఏళ్ల జీవిత పార్శ్వాన్ని ఈ పుస్తకంలో పొందుపరిచారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ, ఏపీ, ఒడిశా, త్రిపుర గవర్నర్లు జిష్ణుదేవ్ వర్మ, జస్టిస్ అబ్దుల్ నజీర్, కంభంపాటి హరిబాబు, ఇంద్రసేనారెడ్డి హాజరయ్యారు. తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భాజపా ఎంపీ లక్ష్మణ్, కాంగ్రెస్ నేతలు కె.కేశవరావు, వి.హనుమంతరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. మనోహర్ షిండే వల్లే తాను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నానని చెప్పారు. ''ఆర్ఎస్సెస్ నా ప్రాణం, నా ఆత్మ, నా సర్వం. వి రామారావు నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చి నడిపించారు. ఇంద్రాసేనారెడ్డి కూడా నా వెన్నంటే ఉన్నారు. రాజకీయాలు వృత్తి, వ్యాపారం కోసం కాదు.. సమాజం కోసం. సమాజం కోసం పనిచేయాలి. పేదల వృద్ధికి కృషి చేయాలి''అని అన్నారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తూ.. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఇది కేవలం వ్యక్తిగత ప్రయాణం కాదని, గత 60 ఏళ్లలో భారత రాజకీయ, సామాజిక మార్పులకు ప్రతీక అని అన్నారు. ఇలాంటి వ్యక్తిని అందించినందుకు దత్తాత్రేయ తల్లిదండ్రులకు దేశం కృతజ్ఞతలు చెబుతోందన్నారు. ''దత్తాత్రేయ.. వాజ్‌పేయి, అద్వానీ వంటి ప్రముఖులతో కలిసి పనిచేశారు. పని చేసిన ప్రతి హోదాలో పేదలకు మేలు చేసేందుకు విశేషంగా కృషి చేశారు. అలయ్ బలయ్ ద్వారా అందరినీ ఒక తాటిపైకి తీసుకొస్తున్నారు. అధికారం కేవలం పరపతి, పేరు కోసం కాదు.. సేవ చేసేందుకు అనేందుకు ఆయన జీవితం ఒక నిదర్శనం''అని అన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. రాజకీయాల్లో నీతి, నిజాయితీ ఎంత ముఖ్యమో.. సిద్ధాంతాలూ అంతే ముఖ్యమన్నారు. రాజకీయాల్లో ఎలా జీవించాలో దత్తాత్రేయను చూసి నేర్చుకోవాలని చెప్పారు. ''రాజకీయ విమర్శలు పదునుగా, అర్థవంతంగా ఉండాలి. కానీ, కొందరు నాయకులు దిగజారిన భాష వాడుతున్నారు. బూతులు మాట్లాడే వారికి పోలింగ్ బూత్‌లో జవాబివ్వాలి. ఎంత పైస్థాయికి వెళ్లినా అంత సంస్కారంగా ఉండాలి. తార్కిక దృక్పథంతో సిద్ధాంతాలు పాటించాలి. సైద్ధాంతిక రాజకీయ విలువలు దేశానికి మేలు చేస్తాయి. భారత్ మరింత శక్తిమంతంగా తయారవుతోంది. ఈ శక్తి వేగాన్ని ఇలాగే కొనసాగించాలి. ఎవరి పనిని వారు సక్రమంగా చేయడమే దేశభక్తి''అని చెప్పారు. అత్యున్నత మానవ విలువలున్న నేత దత్తాత్రేయ అని విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. దత్తాత్రేయ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి పార్టీలకతీతంగా తెలుగు రాష్ట్రాల నుంచి తరలి వచ్చారని చెప్పారు. దత్తాత్రేయ.. ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారని కొనియాడారు.

## మాగంటి గోపీనాథ్ భౌతికకాయం వద్ద కేసీఆర్ కంటతడి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ (62) ఆదివారం కన్నుమూశారు. మూడు రోజుల క్రితం తీవ్రమైన గుండెపోటుకు గురైన ఆయన, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, ఇటీవలే శస్త్రచికిత్స కూడా చేయించుకున్నారని తెలిసింది. గోపీనాథ్ మరణవార్త తెలియగానే బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. మాదాపూర్‌లోని డాక్టర్స్ కాలనీలో ఉన్న గోపీనాథ్ నివాసానికి చేరుకున్న కేసీఆర్, ఆయన పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి గురై



కంటతడి పెట్టారు. గోపీనాథ్ కుటుంబ సభ్యులను ఓదార్చిన కేసీఆర్, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు, ఎంపీ రవిచంద్ర తదితరులు కూడా గోపీనాథ్‌కు నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు, గోపీనాథ్ మృతి పట్ల కేసీఆర్ ఒక ప్రకటనలో తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మోదీ, చంద్రబాబు వద్ద చదువుకుని... రాహుల్ వద్ద ఉద్యోగం చేస్తున్నా

- **హైదరాబాదులో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ**
- **హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి**
- **ఇటీవల నీతి ఆయోగ్ సమావేశం సందర్భంగా జరిగిన సంభాషణ వెల్లడించిన వైనం**

ఇవాళ హైదరాబాదులో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఓ ఆసక్తికర అంశాన్ని అందరితో పంచుకున్నారు. ఇటీవల తాను ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి హాజరయ్యానని, ఈ సందర్భంగా ఆయనతో కలిసి మధ్యాహ్న భోజనం చేశానని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మోదీ... చంద్రబాబు గారిని చూపించి మీ సన్నిహితుడు కూడా ఇక్కడే ఉన్నారు అని చెప్పారు. అప్పుడు నేను... స్కూల్ మీ (బీజేపీ) వద్ద చదువుకున్నాను... కాలేజి ఆయన (చంద్రబాబు) వద్ద చదువుకున్నాను... ఇప్పుడు రాహుల్ గాంధీ వద్ద ఉద్యోగం చేస్తున్నాను అని చెప్పాను. దాంతో అందరూ నవ్వేశారు" అని రేవంత్ రెడ్డి వివరించారు.

# కాకాణిని నెల్లూరు జైలుకు తరలించిన పోలీసులు

* అక్రమ మైనింగ్ కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీస్ కస్టడీ పూర్తి
* మూడు రోజుల పాటు కృష్ణపట్నం పోర్టు పోలీసుల విచారణ
* ముత్తుకూరులో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరు
* న్యాయమూర్తి ఆదేశాలతో కాకాణికి జ్యుడీషియల్ రిమాండ్
* నెల్లూరు జిల్లా జైలుకు తరలించిన పోలీసులు
* సోమవారం హైకోర్టులో కాకాణి బెయిల్ పిటిషన్‌పై విచారణ

అక్రమ మైనింగ్ కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న నెల్లూరు జిల్లా వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీస్ కస్టడీ ముగిసింది. ఈ కేసులో ఆయన ఏ4 నిందితుడిగా ఉన్నారు. కృష్ణపట్నం పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో అధికారులు ఆయన్ను మూడు రోజుల పాటు విచారించారు. విచారణ అనంతరం, పోలీసులు గోవర్ధన్‌రెడ్డికి ముత్తుకూరులో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత ఆయన్ను



నెల్లూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి, కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు, పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ కాకాణిని నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. ఇదిలా ఉండగా, గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరగనుంది. ఈ విచారణలో వెలువడే తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## అమరావతి అంటేనే జగన్‌కు అక్కసు

: హోంమంత్రి అనిత



అమరావతి: రాజధాని అమరావతి అంటే వేల మంది రైతుల త్యాగమని హోంమంత్రి అనిత అన్నారు. అక్కడి రైతులు 1,630 రోజులు ఆందోళనలు చేశారని గుర్తుచేశారు. ఇందులో 270 మంది చనిపోయారన్నారు. 'న్యాయస్థానం నుంచి దేవస్థానం' పేరుతో తిరుపతికి పాదయాత్ర చేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతుల పాదయాత్ర సమయంలో అడ్డంకులు సృష్టించిందని విమర్శించారు. 'అమరావతిని వేశ్యల రాజధాని' అని హీనంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. "అమరావతిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. రాజధాని పునర్నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.77,200 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రూ.49 వేల కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. భారతిరెడ్డి గురించి తప్పుగా మాట్లాడారని మా పార్టీ సానుభూతిపరుడైనా.. కిరణ్‌ను అరెస్టు చేసి మహిళల పట్ల గౌరవాన్ని చాటుకున్నాం. రాష్ట్రం అభివృద్ధి పథంలో వెళ్లడం చూసి అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఆంధ్రప్రదేశ్ గౌరవానికి భంగం వాటిల్లేలా సాక్షి ఛానెల్‌లో మాట్లాడారు. అమరావతిపై వ్యాఖ్యలను వైకాపా నేతలు హర్షించకూడదు. అమరావతి అంటే జగన్‌కు మొదటి నుంచీ అక్కసు ఉంది" అని అనిత అన్నారు.

## కర్నూలు జిల్లాలో రైతుకు దొరికిన వజ్రం!

* కర్నూలు జిల్లా పత్తికొండలో తొలకరి వర్షా లకు వజ్రాల వేట
* పొలంలో రైతుకు లభించిన వజ్రం.. రూ.1.5 లక్షలకు అమ్మకం
* తుగ్గలి మండలం జొన్నగిరి పరిసరాల్లో జనం గాలింపు
* చిన్న పిల్లలతో సహా కుటుంబాలు పొలాల్లోనే మకాం
* మట్టి మెత్తబడటంతో వజ్రాల కోసం తీవ్రంగా అన్వేషణ
* గతంలోనూ ఈ ప్రాంతంలో వజ్రాలు దొరికాయన్న స్థానికులు

కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలో తొలకరి జల్లులు కురవడంతో ఓ రైతుకు అనూహ్యంగా అదృష్టం వరించింది. తన పొలంలో ఓ విలువైన వజ్రం దొరకడంతో, ఆ వార్త దావానలంలా వ్యాపించింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, కుటుంబాలతో సహా పిల్లలను వెంటబెట్టుకుని పొలాల్లో వజ్రాల కోసం వెతుకులాట ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే, సాధారణంగా తొలకరి వర్షాలు



రైతులకు కొంత ఉపశమనాన్ని ఇస్తాయి. కానీ ఈ ఏడాది, ఆ వాన చినుకులు ఊహించని సంపదను కూడా మోసుకొచ్చాయి. తుగ్గలి మండల కేంద్రం సమీపంలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఓ రైతు పొలం పనులు చేసుకుంటుండగా ఈ వజ్రం బయటపడింది. తేలికపాటి వర్షం తర్వాత పొలాన్ని చదును చేస్తుండగా ఇది దొరికినట్లు సమాచారం. ఈ అదృష్టవంతుడైన రైతు ఆ వజ్రాన్ని వెంటనే స్థానిక వ్యాపారికి రూ.1.5 లక్షలకు విక్రయించాడు. ఆ ప్రాంతంలో ఆ మాత్రం రేటు పలకడం చిన్న విషయమేమీ కాదు.తుగ్గలి మండలంలోని జొన్నగిరి గ్రామం, దాని పరిసర ప్రాంతాలు గతంలోనూ అప్పుడప్పుడు వజ్రాలు దొరికాయన్న పేరుంది. తాజాగా రైతుకు వజ్రం దొరికిందన్న వార్తతో స్థానికుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. వర్షానికి నేల మెత్తబడటంతో, అసాధారణంగా కనిపించే రాళ్లను గుర్తించే అవకాశం మెరుగైందని భావిస్తూ జనం పొలాల్లో ముమ్మరంగా గాలిస్తున్నారు. ఓ స్థానికుడు తెలిపిన వివరాల ప్రకారం, అనేక మంది గ్రామస్తులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి పొలాల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. మట్టిని జాగ్రత్తగా తవ్వుతూ ఏదైనా రాయి దొరకుతుందేమోనని ఆశగా వెతుకుతున్నారు. "చిన్న పిల్లలు, పసికందులతో సహా ఈ అన్వేషణలో పాల్గొంటున్నారు" అని ఓ వ్యక్తి చెప్పాడు. రోజంతా పొలాల్లోనే ఉండటానికి వీలుగా ఆహారం, ఇతర సామగ్రి కూడా వెంట తెచ్చుకుంటున్నారట. "కొందరు తల్లిదండ్రులు చిన్న పిల్లలను వాకర్లలో కూర్చోబెట్టుకుని, పెద్ద పిల్లలతో కలిసి వెతుకుతున్నారు" అని మరో స్థానికుడు వివరించాడు. ఈ భూమి లోపల రహస్య నిధులు ఉన్నాయని స్థానికులు ఎప్పటి నుంచో నమ్ముతున్నారు. తాజా సంఘటన వారి నమ్మకాన్ని మరింత బలపరిచింది. అయితే, నిపుణులు మాత్రం ఈ ప్రాంతంలో గతంలో వజ్రాలు దొరికినప్పటికీ, అవి చాలా అరుదుగా, ఊహించని విధంగా లభిస్తాయని చెబుతున్నారు. "తొలకరి వర్షపు చినుకులు మంచి పంటను మాత్రమే కాదు, భూమి కింద మెరిసే ఊహించని అదృష్టాన్ని కూడా మోసుకొస్తాయనే ఆశతో ఉన్నాం" అని ఓ గ్రామస్థుడు తెలిపాడు. దీంతో గ్రామస్థులు ఓ వైపు మంచి పంట కోసం, మరోవైపు అదృష్టం కలిసొచ్చి వజ్రాలు దొరకాలని ఆశిస్తున్నారు.



## నారాయణ జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్లను అభినందించిన సీఎం చంద్రబాబు

* ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన నారాయణ కళాశాల జేఈఈ అడ్వాన్స్‌డ్ – 2025 ర్యాంకర్లు
* ఐఐటీ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో ప్రవేశం సాధించడం సామాన్య విషయం కాదని ప్రశంసలు
* జన్మభూమితో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ఉన్నతికి పాటుపడాలని చంద్రబాబు సూచన

జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విజయవాడ నారాయణ కళాశాల విద్యార్థులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 10, 51, 82, 98 ర్యాంకులు సాధించిన వడ్లమూడి లోకేశ్, భాను చరణ్ రెడ్డి, తోరాటి భరద్వాజ్, జస్వంత్ వెంకట రఘువీర్‌లను, వారి తల్లి దండ్రులను ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో ప్రవేశం సాధించడం సామాన్య విషయం కాదని అన్నారు. ఇంతటి ప్రతిభావంతులైన విద్యార్థులు మరిన్ని నూతన శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జన్మభూమితో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ఉన్నతికి పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణ పాల్గొన్నారు.

## రాజధానిపై కుట్రలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవు

: పవన్ కల్యాణ్



అమరావతి: రాజధాని అమరావతి మహిళలపై కృష్ణంరాజు వ్యాఖ్యలను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఖండించారు. "అమరావతిపై వ్యాఖ్యలతో మహిళలను అవమానించారు. అమరావతిలో విలసిల్లిన బౌద్ధాన్ని అవహేళన చేశారు. ఆ ప్రాంత చారిత్రక, ఆధ్యాత్మిక సంపదను విస్మరించవద్దు. రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన వారిలో 32 శాతం ఎస్సీ, ఎస్టీలు, 14శాతం బీసీలు ఉన్నారు. రాజధానిపై కుట్రలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవు. విశ్లేషకుడి ముసుగులో కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృతమైన కుట్ర ఉంది. ఇలాంటి కుట్రలను ప్రజలు, అధికార యంత్రాంగం లోతుగా విశ్లేషించాలి. రాజధానిని, అక్కడి మహిళలను అవమానించేందుకు కుటిల యత్నం" అని పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తిరుమలలో సర్వదర్శనం టోకెన్ల జారీ.. భక్తులకు తప్పని తిప్పలు

కలియుగ దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తారు. తిరుమల శ్రీవారిని దర్శించుకుంటే సకల పాపాలు హరించి పోతాయని భక్తులు విశ్వసిస్తారు. ఈ క్రమంలో కాలినడకన తిరుమల శ్రీవారి సన్నిధికి చేరుకుని భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటారు. ఇక వేసవి కాలంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందనే విషయం తెలిసిందే. ఈ తరుణంలో తిరుమలలో జూన్ 6వ తేదీ నుంచి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్ ద్వారా శ్రీవారి సర్వదర్శనం టోకెన్లు జారీ చేస్తున్నారు. ఈ క్రమంలో శ్రీవారి సమయ నిర్దేశిత సర్వదర్శనం క్యూలైన్‌లో వెళ్లి దర్శించుకునేలా టీటీడీ ఏర్పాట్లు చేసింది. టీటీడీ సర్వదర్శనం టోకెన్లను తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా జారీ చేస్తోంది. అయితే.. శ్రీవారి భక్తులు సర్వదర్శనం టోకెన్లు పొందేందుకు క్యూలైన్లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## అమరావతికి భూములు ఇచ్చిన తల్లుల గురించి నీచంగా మాట్లాడతారా?.. మహిళల మండిపాటు

రాంనగర్ (అనంతపురం): అమరావతి మహిళలను కించపరుస్తూ మాట్లాడిన ఘటనపై అనంతపురం సాక్షి పత్రిక కార్యాలయం వద్ద తెదేపా తెలుగు మహిళా విభాగం నాయకులు ఆందోళన చేశారు. సాక్షి పత్రికలను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యాలయానికి ఉన్న సాక్షి అక్షరాలను తొలగించే ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం పలువురు మహిళలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈక్రమంలో పోలీసులకు, వారికి మధ్య తోపులాట చోటు చేసుకుంది. అంతకు ముందు తెదేపా రాష్ట్ర కార్యదర్శి స్వప్న మాట్లాడుతూ.. నీచంగా మాట్లాడిన వారితో పాటు, సాక్షి యాజమాన్యం పైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమరావతిపై కక్షతో భూములు



ఇచ్చిన తల్లుల గురించి ఇంత నీచంగా మాట్లాడతారా అని ప్రశ్నించారు. భారతీరెడ్డి కూడా ఒక మహిళే కదా.. దీనిపై ఎందుకు స్పందించడం లేదన్నారు. జగన్ రెడ్డికి ఇద్దరు ఆడబిడ్డలు ఉన్నారు కదా.. ఇలా మాట్లాడే వారిని ప్రోత్సహిస్తారా అంటూ మండిపడ్డారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని, కృష్ణంరాజులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

## రేర్ ఎర్త్స్ ఎగుమతులపై చైనా ఆంక్షలు..

### స్విఫ్ట్ కార్ల ఉత్పత్తిని నిలిపివేసిన సుజుకీ..!




**న్యూఢిల్లీ:** జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ సుజుకీ మోటార్స్ కీలక నిర్ణయం తీసుకున్నది. కంపెనీకి చెందిన పాపులర్ మోడల్ కార్ స్విఫ్ట్ ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేసింది. చైనా సర్కారు రేర్ ఎర్త్ పదార్థాల ఎగుమతులపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆంక్షల కారణంగా విడిభాగాలు లభించకపోవడంతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలుస్తున్నది. చైనా రేర్ ఎర్త్స్ ఎగుమతులపై ఆంక్షలు అమలు చేయడం వల్ల ప్రభావితమైన తొలి ఆటోమొబైల్ కంపెనీ సుజుకీ. స్విఫ్ట్ సబ్‌కాంపాక్ట్ మోడల్ (స్విఫ్ట్ స్పోర్ట్ మినహా) ఉత్పత్తిని మే 26 నుంచి జూన్ 6 వరకు నిలిపివేస్తున్నట్లు కంపెనీ గతంలోనే ప్రకటించింది. విడిభాగాల కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో తెలిపింది. అయితే, కొరతకు దారితీసిన కారణాలపై మాత్రం స్పందించలేదు. ఉత్పత్తి నిలిపివేతకు సంబంధించిన కారణాలపై స్పందించేందుకు కంపెనీ ప్రతినిధి నిరాకరించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అంతర్జాతీయ మీడియా సంస్థ కథనం ప్రచురించింది. ఏప్రిల్ నెలలో చైనా ప్రభుత్వం అనేక రకాల రేర్ ఎర్త్ పదార్థాలు, వాటితో ముడిపడిన అయస్కాంతాల ఎగుమతులను నిలిపివేసింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా ఆటోమొబైల్ తయారీ సంస్థలు, ఏరోస్పేస్ కంపెనీలు, సెమీకండక్టర్ల తయారీదారులు, సైనిక కాంట్రాక్టర్ల సరఫరా వ్యవస్థలపై చైనా నిర్ణయం తీవ్ర ప్రభావం పడుతున్నది. రేర్ ఎర్త్ పదార్థాలు అనేక కీలకమైన ఎలక్ట్రానిక్, మాగ్నెటిక్ భాగాల తయారీలో వినియోగిస్తారు. చైనా ఆంక్షలతో కొన్ని యూరోపియన్ ఆటో విడిభాగాల తయారీ ప్లాంట్లు సైతం ఇప్పటికే ఉత్పత్తులను నిలిపివేశారు. ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ సైతం రేర్ ఎర్త్స్ కొరతను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నది.

## బీమా విషయంలో ఐఆర్‌డీఏఐ కీలక నిర్ణయం..



**న్యూఢిల్లీ:** బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ కార్ల బీమా విషయంలో ఇటీవల కీలక సిఫార్సులను చేసింది. ఈ సిఫారసుల వల్ల థర్డ్-పార్టీ బీమా ప్రీమియాన్ని పెంచే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ ప్రతిపాదనతో ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ వంటి కంపెనీల షేర్లు భారీగా పెరిగాయి.

భారతదేశంలో ఇన్సూరెన్స్ కంపెనీలను రెగ్యులేట్ చేసే ఐఆర్‌డీఏఐ ఇటీవల మోటరు వాహనాల ప్రీమియాన్ని 18 శాతం పెంపును సూచించింది. కొన్ని వాహన వర్గాలపై 20 నుంచి 25 శాతం వరకు పెంచాలని పేర్కొంది. ఈ ప్రతిపాదనపై రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ తుది నిర్ణయం తీసుకుంటుంది. రాబోయే 2 నుంచి 3 వారాల్లోపు ఈ పెంపు ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఆమోదం పొందిన తర్వాత ప్రజల సంప్రదింపుల కోసం ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఆ తర్వాత అమలుకు ముందు సమీక్ష ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ వార్తల నేపథ్యంలో బీమా కంపెనీల షేర్లు పెరిగాయి. ఐసీఐసీఐ లాంబార్డ్ షేర్లు 7 శాతం పెరిగాయి. గత మూడు నెలల్లో అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. గో డిజిట్ ఇన్సూరెన్స్ షేర్లు దాదాపు 5 శాతం పెరిగాయి. ఇది గత ఆరు నెలల్లో అత్యధిక స్థాయిని సూచిస్తుంది. అదే సమయంలో న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ షేర్లు దాదాపు 2 శాతం పెరిగాయి.

రోడ్డు ప్రమాదంలో మూడోపక్ష బీమా మన వాహనం ద్వారా మూడో పక్షానికి జరిగే నష్టాన్ని భర్తీ చేస్తుంది. మీ వాహనం వల్ల ఒక వ్యక్తి గాయపడితే లేదా వారి ఆస్తికి నష్టం జరిగితే దాని ఖర్చులను కవర్ చేస్తుంది. మోటారు వాహన చట్టం, 1988 ప్రకారం ఈ బీమా తప్పనిసరి. మీ వాహనం వల్ల మరొకరికి హాని జరిగితే బీమా కంపెనీ ఖర్చులను భరిస్తుందని నిర్ధారిస్తుంది. గత మూడు నాలుగు సంవత్సరాలుగా ఈ రంగంలో వివిధ అనిశ్చితులు ఉన్నప్పటికీ ప్రీమియంలో ఎలాంటి మార్పు లేదు. 20 శాతం ప్రీమియం పెంపుదల బీమా కంపెనీల పనితీరును మెరుగుపరుస్తుందని, ఈ రంగానికి ఉపశమనం కలిగించగలదని నిపుణులు భావిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి, కార్లు, ద్విచక్ర వాహనాలు సహా ప్రైవేట్ వాహనాలకు ఇంజిన్ సామర్థ్యం (సిసి) ఆధారంగా ప్రతిపాదిత పెంపుదలలను ఐఆర్‌డీఏఐ వివరించింది.

ప్రైవేట్ వాహనాల్లో ప్రధానంగా ప్రైవేట్ కార్లు మరియు ద్విచక్ర వాహనాలు ఉంటాయి. ఇంజిన్ సామర్థ్యం (సీసీ) ఆధారంగా ఐఆర్‌డీఏఐ ప్రీమియంను నిర్ణయిస్తుంది. 1000 సీసీ వరకు ఉన్న ప్రైవేట్ కార్లకు ప్రస్తుత ప్రీమియం రూ.2,094గా ఉంటే 18 శాతం పెరుగుదలతో ఇది రూ.2,471కి పెరుగుతుంది. అలాగే 25 శాతం పెరుగుదలతో ఇది రూ.2,618కి పెరుగుతుంది. 1000 సీసీ, 1500 సీసీ మధ్య ఇంజిన్ సామర్థ్యం ఉన్న కార్లకు, ప్రస్తుత ప్రీమియం రూ.3,416గా ఉంటే 18 శాతం పెరుగుదలతో ఇది రూ.4,031కి చేరుకుంటుంది. 25 శాతం పెరుగుదలతో ఇది రూ.4,270కి పెరుగుతుంది. 1500 సీసీ కంటే ఎక్కువ ఉన్న కార్లకు ప్రస్తుత ప్రీమియం రూ.7,897గా ఉంటే 18 పెరుగుదలతో ఇది రూ.9,318గా మారుతుంది. 25% పెరుగుదలతో ఇది రూ.9,871కి చేరుకుంటుంది.

## ఈవీ కార్ల అమ్మకాల్లో మహీంద్రా రికార్డులు..

### 70 రోజుల్లో 10 వేల కార్ల అమ్మకాలు



**న్యూఢిల్లీ:** మహీంద్రా ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాల్లో ఏ కంపెనీ సాధించని కొత్త మైలురాయిని సాధించింది. ఆ కంపెనీ మార్చి మధ్యలో ప్రారంభించిన ఈవీ డెలివరీలు కేవలం 70 రోజుల్లోనే 10,000 యూనిట్లకు పైగా కార్లు అమ్ముడయ్యాయి. ఎక్స్ఈవీ 9ఈ, బీఈ6 ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలు కారణంగానే ఈ స్థాయి అమ్మకాలు సాధ్యమయ్యాయి. ఈ కంపెనీ ప్రస్తుతం రెండు మోడళ్లలో పూర్తిగా లోడ్ చేయబడిన 'ప్యాక్ త్రీ' వేరియంట్లను మాత్రమే అందిస్తోంది. ఈ కార్లు 79 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్తో వస్తాయి.

మహీంద్రా ప్రతి మోడల్‌కు సంబంధించిన వ్యక్తిగత అమ్మకాల గణాంకాలను వెల్లడించనప్పటికీ ప్రారంభ ట్రెండ్ స్పష్టంగా ఎక్స్ఈవీ 9ఈ మరింత ప్రజాదరణ పొందుతున్నట్లు చూపిస్తుంది. రెండు మోడళ్లపై కస్టమర్ ఆసక్తి ప్రారంభం నుంచి అధికంగా ఉంది. బుకింగ్స్ మొదటి రోజున మహీంద్రాకు కలిపి 30,179 ఆర్డర్లు వచ్చాయి. వాటిలో ఎక్స్ఈవీ 9ఈ 56 శాతం, బీఈ 6 మిగిలిన 44 శాతం బుక్కింగ్లను పొందాయి. బుకింగ్స్ మొత్తం విలువ రూ. 8,472 కోట్లుగా ఉంది. ఎక్స్ఈవీ 9ఈ ధర రూ.21.90 లక్షల నుంచి రూ.30.50 లక్షల మధ్య ఉంటుంది. బీఈ 6 ధర రూ.18.90 లక్షల నుంచి ప్రారంభమై రూ.26.90 లక్షల వరకు ఉంటుంది. ఎక్స్ఈవీ 9ఈ కారును ఒక్కసారి ఛార్జ్ చేస్తే 656 కి.మీ మైలేజ్ ఇస్తుంది. అలాగే బీఈ 6 683 కి.మీ మైలేజ్ ఇస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ రెండు ఎస్‌యూవీలను 140 కేడబ్ల్యూ డీసీ ఫాస్ట్ ఛార్జర్ ఉపయోగించి కేవలం 20 నిమిషాల్లో 20 నుంచి 80 శాతం వరకు ఛార్జ్ చేయవచ్చు. ఎక్స్ఈవీ 9ఈ 282 బీహెచ్‌పీ, 380 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. క్యాబిన్ లోపల మహీంద్రా ఎస్‌యూవీలను హైటెక్ సెటప్‌తో అమర్చారు. ఇందులో మూడు స్క్రీన్లు, 16 స్పీకర్ సౌండ్ సిస్టమ్, ఏఆర్-ఆధారిత హెడ్స్- అప్ డిస్‌ప్లే, డ్రైవర్, ప్రయాణీకులను పర్యవేక్షించడానికి కెమెరాలు వంటి ఫీచర్లు ఆకట్టుకుంటున్నాయి.

# ఒలింపిక్ విజేతను కాపీ కొట్టి..

# గ్రాండ్‌స్లామ్ పట్టేసింది!



**న్యూయార్క్:** 'పెద్ద పెద్ద కలలు కనండి. ఆ కలలను సాకారం చేసుకునేందుకు శ్రమించండి' అని పెద్దలు చెబుతుంటారు. ఆ మాటలు అక్షర సత్యమని నిరూపిస్తోంది అమెరికా టీనేజర్ కోకో గాఫ్. టీనేజ్ నుంచే వార్తల్లో నిలుస్తున్న తను రెండేళ్ల క్రితం యూఎస్ ఓపెన్ ట్రోఫీతో సంచలనం సృష్టించింది. ఇప్పుడు ఏకంగా ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌తో తన కలను సాకారం చేసుకుందీ యువకెరటం. మ్యాచ్ అనంతరం ఈ యంగ్‌స్టర్ తన విజయ రహస్యాన్ని వెల్లడించింది. ఒలింపిక్ విజేతను స్ఫూర్తిగా తీసుకొని టైటిల్ గెలుపొందాను అని తెలిపిందీ నయా ఛాంపియన్.

మనం ఏదైనా సాధించాలంటే లక్ష్యాన్ని స్పష్టంగా చూడాలి. పట్టుదల, ఆత్మవిశ్వాసంతో పాటు కచ్చితంగా నేను విజయం సాధిస్తాననే నమ్మకం కూడా ఉండాలి. అప్పుడే ఫ్రెంచ్ ఓపెన్ విజేతగా అవతరించిన గాఫ్ కూడా ఇదే మంత్రను అనుసరించిందట. 'ఫ్రెంచ్ ఓపెన్ ముందు నేను అమెరికా అథ్లెట్, ఒలింపిక్ విజేత గబ్బీ థామస్‌ను స్ఫూర్తిగా తీసుకున్నాను. ప్యారిస్ విశ్వక్రీడల 200 మీటర్ల ఛాంపియన్ అయిన గబ్బీకి ఒక అలవాటు ఉండేది.

తాను కచ్చితంగా ఒలింపిక్స్‌లో విజయం సాధిస్తానని ఆమె కాగితం మీద రాసుకుందట. ఇదే విషయాన్ని మెడల్ సాధించిన అనంతరం మీడియాతో చెప్పింది. నేను కూడా ఆవిడను అనసరిస్తూ.. 'నేను 2025 ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ అవుతాను' అని ఒక బుక్‌లో రాసుకున్నా. అప్పట్నుంచి అద్దంలో నన్ను నేను చూసుకుంటూ విజయం నాదే అని పదే పదే అనుకునేదాన్ని. థామస్ పాటించిన సూత్రం నా విషయంలోనూ నిజమైంది. నేను నమ్మినట్టే ఈసారి మట్టికోర్టులో విజేతగా అవతరించాను' అని ఒలింపిక్ విజేతను కాపీ కొట్టిన తీరును గాఫ్ పూసగుచ్చింది.

**తొలి సెట్ కోల్పోయినప్పటికీ..**

అమెరికా సంచలనం కొకొ గాఫ్ తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్‌గా అవతరించింది. కెరియర్లో రెండో గ్రాండ్‌స్లామ్ సొంతం చేసుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్‌లో నంబర్ 1 అరీనా సబలెంకపై అద్భుత విజయంతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఉత్కంఠ పోరులో పట్టువదలకుండా చెలరేగిన తను ప్రత్యర్థికి చెక్ పెట్టింది. తొలి సెట్ కోల్పోయినప్పటికీ తన మార్క్ ఆటతో విరుచుకుపడ్డ గాఫ్.. చివరి రెండు సెట్లు గెలుపొందిన తన కలను సాకారం చేసుకుంది.

టైటిల్ పోరులో అరీనా సబలెంక నుంచి ఆమెకు గట్టి పోటీ ఎదురైంది. పైగా తొలి సెట్‌ను 6-7తో కోల్పోయిందీ యంగ్‌స్టర్. అయినా సరే తను పట్టువిడవలేదు. అసమాన పోరాటపటిమను కనబరిచిన గాఫ్.. బెలారస్ భామకు ముచ్చెమటలు పట్టించింది. ఫోర్‌హ్యాండ్ షాట్లతో చెలరేగి రెండో సెట్‌ను 6-2తో అలవోకగా గెలుచుకున్న ఈ యవకెరటం.

మూడో సెట్‌లోనూ సబలెంకపై పైచేయి సాధించింది. బ్రేక్ పాయింట్లు సాధిస్తూ.. పదునైన షాట్లతో ఆమెను నిలువరించిన గాఫ్ 6-4తో గెలుపొంది తన ఫ్రెంచ్ ట్రోఫీ కలను నిజం చేసుకుంది. తద్వారా లెజెండ్ సెరెనీ విలియమ్స్ తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ సాధించిన అమెరికన్‌గా గాఫ్ రికార్డు నెలకొల్పింది.



## బెల్జియంపై థ్రిల్లింగ్ విక్టరీ

### యూరప్ పర్యటనలో అదిరిన బోణీ..!

**యూరప్:** ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ సన్నద్ధతలో ఉన్న భారత మహిళల జూనియర్ హాకీ జట్టు యూరప్ పర్యటనను విజయంతో ఆరంభించింది. ఆదివారం జరిగిన పోరులో బలమైన బెల్జియంను చిత్తుగా ఓడించింది. తద్వారా ఈ లీగ్‌లో గోల్ కీపర్ నిధి నేతృత్వంలోని టీమిండియా అదిరే బోణీ కొట్టింది. ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై దాడి చేసిన భారత అమ్మాయిలు జట్టుకు 3-2తో విక్టరీని అందించారు. జూన్ 10న మళ్లీ బెల్జియంతోనే భారత్ తలపడనుంది.



ఈమధ్యే నాలుగు దేశాల టోర్నీలో అద్భుతంగా రాణించిన భారత జట్టు తొలి మ్యాచ్‌లోనే అదరగొట్టింది. పటిష్టమైన బెల్జియం డిఫెండర్ల కళ్లు గప్పుతూ.. తొలి అర్థ భాగంలోనే ఫార్వర్డ్ ప్లేయర్ గీతా యాదవ్ గోల్ చేసింది. 11 వ నిమిషంలో ఆమె చేసిన గోల్‌తో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే.. 25వ నిమిషంలో ప్రత్యర్థి క్రీడాకారిణి మరీ గోయెన్స్ స్కోర్ సమం చేసింది. కాసేపటికే లూయిస్ వాన్ హెకే గోల్‌తో బెల్జియం జట్టు స్కోర్ 2-1కు చేరింది. అయినా సరే భారత క్రీడాకారిణులు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు.

సోనమ్ 40వ నిమిషంలో మెరుపు గోల్‌తో పోటీలోకి వచ్చిన టీమిండియా ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వలేదు. 45వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్ పోస్ట్‌లోకి పంపిన డిఫెండర్ లథన్‌ట్లుంగి భారత్‌కు స్పష్టమైన ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత బెల్జియం అమ్మాయిలు గోల్ కోసం చేసిన ప్రయత్నాలను మన డిఫెండర్లు తిప్పికొట్టారు. దాంతో, భారత్ తొలి పోరులోనే భారీ విజయంతో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకుంది.

## మూడురోజుల్లో డబ్ల్యూటీసీ ఫైనల్..

## లండన్ చేరుకున్న దక్షిణాఫ్రికా జట్టు




**లండన్:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు మరో మూడు రోజులే ఉంది. ఇప్పటికే లండన్ చేరుకున్న ఆస్ట్రేలియా ఆటగాళ్లు మ్యాచ్ కోసం సన్నద్ధమవుతున్నారు. రెండో ఫైనలిస్ట్ అయిన దక్షిణాఫ్రికా జట్టు సైతం శనివారం లండన్‌లో అడుగుపెట్టింది. ప్రతిష్టాత్మకమైన టెస్టు గద పోరుకోసం ప్రత్యేక బస్సులో లార్డ్స్ చేరుకున్నారు సఫారీ క్రికెటర్లు.

డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆడుతున్నామనే భావన ఎంతో థ్రిల్లింగ్‌గా ఉందని చెప్పారు ప్రొటీస్ ప్లేయర్లు. ఆ జట్టు ప్రధాన ఆటగాళ్లు మర్క్‌రమ్, కేశవ్ మహరాజ్, ట్రిస్టన్ స్టబ్స్, పేసర్ కార్బిన్ బాస్చ్‌లు బిగ్ ఫైట్‌లో విజయం తమదేననే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. తమ స్క్వాడ్ లండన్‌లోని టీమ్ హోటల్‌కు బస్సులో వెళ్తున్న వీడియోను సౌతాఫ్రికా బోర్డు ఆదివారం ఎక్స్‌లో వీడియో పోస్ట్ చేసింది.

కలల ట్రోఫీ వేటలో

డబ్ల్యూటీసీ మూడో సీజన్ ఫైనల్ జూన్ 11న మొదలుకానుంది. లార్డ్స్ మైదానంలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలు టెస్టు గద కోసం హోరాహోరీగా తలపడనున్నాయి. కమిన్స్ సారథ్యంలోని ఆసీస్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆడనుండగా.. సఫారీల తమ ఐసీసీ ట్రోఫీ కలను సాకారం చేసుకునేందుకు శ్రమించనున్నారు. నిరుడు టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో 7 పరుగుల తేడాతో ఓడిన ప్రొటీస్ టీమ్.. ఈసారి 'ఛాంపియన్లం' అనిపించుకోవాలనే కసితో ఉంది. దాంతో, డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్‌పై అభిమానుల్లో ఆసక్తి ఎక్కువవుతోంది.

టెస్టు క్రికెట్‌ను బతికించేందుకు ఐసీసీ నిర్వహిస్తున్న ఈ ఛాంపియన్‌షిప్‌లో న్యూజిలాండ్ మొట్టమొదటి ఛాంపియన్‌గా అవతరించింది. రెండేళ్ల క్రితం భారత్‌కు షాకిస్తూ ఆస్ట్రేలియా టెస్టు గదను తన్నుకుపోయింది. దాంతో, వరుసగా రెండు పర్యాయాలు ఫైనల్ చేరిన టీమిండియా రన్నరప్‌గా తిరిగొచ్చింది. ఈ నేపథ్యంలో లార్డ్స్‌లో జరుగబోయే మూడో ఫైనల్లో విజయం ఎవరిని వరిస్తుంది? అనేది సర్వత్రా ఆసక్తి రేపుతోంది.

## భారత అథ్లెట్లకు నాలుగు స్వర్ణాలు

### రజతంతో మెరిసిన యశాస్..!

**తైవాన్:** భారత అథ్లెట్లు తైవాన్ ఓపెన్‌లో పతకాల పంట పండించారు. శనివారం జ్యోతి ఎర్రాజీ, అబ్దుల్లా, పూజలు స్వర్ణాలతో మెరవగా.. పోటీల చివరి రోజైన ఆదివారం కూడా మరో నాలుగు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. మూడుసార్లు జాతీయ ఛాంపియన్ విథ్యా రామరాజ్, రోహిత్ యాదవ్, పూజా, క్రిష్ణ కుమార్‌లు తమ తమ విభాగాల్లో పసిడితో గర్జించారు. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో యశాస్ పలాక్ష వెండి వెలుగులు విరజిమ్మాడు.

తైవాన్ చివరిరోజున భారత అథ్లెట్లు పసిడి మోత మోగించారు. మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో వైథ్యా చిరుతలా పరుగెత్తి స్వర్ణం కొల్లగొట్టింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఆమె 56.53 సెకన్లలోనే లక్ష్యానికి చేరుకుంది. తద్వారా త్వరలో జరుగబోయే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో వైథ్య ర్యాంకింగ్స్ మెరుగవ్వనుంది. జావెలిన్ త్రోలో రోహిత్ అత్యుత్తమ ప్రదర్శన చేయకపోయినా 74.42 మీటర్ల దూరం ఈటెను విసిరి బంగారు పతకం సాధించాడు.






ఇక మహిళల, పురుషుల 800 మీటర్ల పరుగులో భారత అథ్లెట్లు అదరగొట్టారు. అంచనాలను అందుకుంటూ పూజ భారత్‌కే చెందిన ట్వింకిల్ చౌదరీని రెండో స్థానానికి పరిమితం చేస్తూ 2.02 79 సెకన్లలో ఫినిషింగ్ లైన్ దాటింది. పురుషుల ఫైనల్లో క్రిష్ణ కుమార్ ప్రత్యర్థులకు షాకిస్తూ 148 46 సెకన్లలోనే లక్ష్యానికి చేరుకొని గోల్డ్ మెడల్ ఖాతాలో వేసుకున్నాడు.

**100 మీటర్ల హర్డిల్స్‌లో..**

పది రోజుల క్రితం ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం సాధించిన జ్యోతి ఎర్రాజీ మరోసారి మెరిసింది. 100 మీటర్ల హర్డిల్స్‌లో తనకు తిరుగులేదని చాటుతూ తైవాన్ ఓపెన్ లోనూ పసిడి వెలుగులు విరజిమ్మింది. శనివారం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో చిరుతలా పరుగెత్తిన జ్యోతి 12.99 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది. పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబాకర్, మహిళల 1500 మీటర్ల పరుగులో పూజలు కూడా స్వర్ణంతో మనదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేశారు.

# చిరు ఫ్యాన్స్‌కి డబుల్ ట్రీట్ ఇవ్వబోతున్న అనీల్ రావిపూడి..



**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి కుర్ర హీరోలతో పోటీ పడుతూ సినిమాలు చేస్తున్నారు. ఆయన ఇటీవల విశ్వంభర చిత్ర షూటింగ్ పూర్తి చేసి ఇప్పుడు అనీల్ రావిపూడి దర్శకత్వంలో చేస్తున్నాడు. డైరెక్టర్ వశిష్టతో చేసిన విశ్వంభర చిత్రం సోషియో ఫాంటసీ సినిమాగా తెరకెక్కుతుంది . ఈ సినిమాలో త్రిష హీరోయిన్ గా నటిస్తుండగా, కీరవాణి విశ్వంభరకు సంగీతం అందిస్తున్నాడు.అయితే విశ్వంభర సినిమాపై ఇప్పటి వరకు ఎటువంటి అప్ డేట్ రాలేదు. కాని ఇటీవల మొదలైన అనిల్ రావిపూడి సినిమా మాత్రం పరుగులు పెడుతోంది. ఇక ఈసినిమా స్టార్ట్ అయిన అప్పటి నుంచి నిత్యం ఏదో ఒక వార్త టాలీవుడ్‌లో హల్‌చల్ చేస్తూనే ఉంది. ఈ మూవీ ఇప్పటికే తొలి షెడ్యూల్ పూర్తి చేసుకున్నట్టు తెలుస్తుండగా, మరి కొద్ది రోజులలో రెండో షెడ్యూల్ మొదలు పెట్టనున్నారట. చిరంజీవి కెరీర్లో 157వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్లో చిరంజీవి డ్యూయల్ రోల్ లో కనిపించనున్నారనే వార్త ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అయింది. రెండు పాత్రలలో ఒక పాత్ర వింటేజ్ చిరంజీవిని గుర్తు చేసేలా ఉంటుందని, మరో పాత్ర ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఉంటుందట. అయితే దీనిపై మూవీ టీమ్ నుంచి ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. కాని టాలీవుడ్ సర్కిల్ లో మాత్రం ఈ రూమర్ షికారు చేస్తోంది.ఇప్పుడు నయనతార , చిరంజీవిపై ఫ్యామిలీ సీన్స్ చిత్రీకరిస్తున్నాడట అనీల్ రావిపూడి.

వారిద్దరి మధ్య వచ్చే కామెడీ సీన్స్ చాలా బాగా వచ్చాయని అంటున్నారు. ఈ సీన్స్ సినిమాకి హైలైట్ అవుతాయని అంటున్నారు. ఈ సినిమాను సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిరంజీవి గత సినిమాలన్నీ యాక్షన్ డ్రామాలు కాగా, ఈసారి ప్యూర్ కామెడీ ఎంటర్‌టైనర్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ తో పాటు, కామన్ ఆడియన్స్ కూడా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మెగా157 సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, ఆయన ఈ మూవీ కోసం అద్భుతమైన బాణీలు రూపొందిస్తున్నట్టు తెలుస్తుంది.

# షూటింగ్ పూర్తిచేసుకున్న కార్తీ 'సర్దార్ 2'



**టాకీస్:** తమిళ నటుడు కార్తీ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రాలలో సర్దార్ ఒకటి. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తమిళంతో పాటు తెలుగులోనూ రూ.100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అయితే ఈ సినిమాకు తాజాగా సీక్వెల్‌ను రాబోతున్న విషయం తెలిసిందే. పీఎస్ మిత్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మాళవిక మోహనన్ కథానాయకగా నటిస్తుంది. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమా షూటింగ్ తాజాగా కంప్లీట్ చేసుకున్నట్లు కార్తీ సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. థాయిలాండ్‌లోని హావా హిన్ ఎయిర్‌పోర్ట్‌లో చిత్రయూనిట్‌తో కేక్ కట్ చేస్తూ.. సర్థార్ 2 షూటింగ్ పూర్తయినట్లు తెలిపాడు.

'సర్దార్ 2' సినిమాకు యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. పార్ట్ 1కు జీవీ ప్రకాష్ కుమార్ సంగీత దర్శకుడిగా పని చేయగా, సీక్వెల్‌కు యువన్ శంకర్ రాజాను తీసుకోవడం సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది. అంతేకాకుండా, ఈ సీక్వెల్‌లో స్టార్ నటుడు ఎస్‌జే సూర్య కీలక పాత్రలో నటించబోతున్నారు. 'సర్దార్ 2' చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై లక్ష్మణ్ కుమార్, ఇషాన్ సక్సేనా నిర్మిస్తున్నారు.

# నితిన్ 'తమ్ముడు' నుంచి కొత్త పోస్టర్

**టాకీస్:** టాలీవుడ్ నటుడు నితిన్ కొంతకాలంగా సరైన సక్సెస్ లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఇటీవల వచ్చిన రాబిన్‌హుడ్ చిత్రం కూడా ఆశించిన విజయం అందుకోలేదు. దీంతో ఎలాగైన హిట్ కొట్టాలనే కసితో ప్రస్తుతం తమ్ముడు అనే సినిమాలో నటిస్తున్నాడు. వేణు శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ ఎమోషనల్ యాక్షన్ డ్రామా షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమాలో కాంతార నటి సప్తమి గౌడ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. నేడు సప్తమి బర్త్‌డే కావడంతో ఆమెకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ ఫొటో చూస్తుంటే.. ట్రైబల్ యువతిగా సప్తమి కనిపించబోతున్నట్లు తెలుస్తుంది.

మరోవైపు తమ్ముడు సినిమా మొదలై రెండేళ్లు అవుతున్నా, ఇప్పటివరకు పెద్దగా అప్‌డేట్స్ రాలేదు. కేవలం రెండు గ్లింప్స్‌ను మాత్రమే విడుదల చేశారు. మొదట ఈ చిత్రాన్ని 2025 జూలై 4న విడుదల చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, విజయ్ దేవరకొండ 'కింగ్ డమ్' కారణంగా విడుదల వాయిదా పడిందని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం, జూలై 25న 'తమ్ముడు' సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ సినిమాలో లయ, స్వశిక, వర్ష బొల్లమ్మ, సౌరభ్ సచ్‌దేవా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించారు.





# టూ ఇయర్స్ తర్వాత టాలీవుడ్‌లోకి రాశీఖన్నా..

టాకీస్:
తన కెరీర్‌కు తిరుగులేని స్టార్ డమ్ తెచ్చి పెట్టిన టాలీవుడ్‌కు కాస్తంతా ధూరంగా ఉంటుంది రాశీ ఖన్నా. ప్రజంట్ తన ఫోకస్ మొత్తం తమిళ్, హిందీ ఇండస్ట్రీల పైనే పెట్టి... వరుస సినిమాలు సిరీస్‌లతో అదరడ గొడుతుంది. మొత్తనికి దాదాపు టు ఇయర్స్ తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది రాశీ. చైకి జోడిగా థాంక్యూ" తర్వాత సైన్ చేసిన ప్రాజెక్ట్ తెలుసుకదా". జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ మూవీ, రెండేళ్లుగా షూటింగ్ జరుపుకుని ఎట్టకేలకు రిలీజ్ డేట్ లాక్ చేసుకుంది. అక్టోబర్ 17న ఈ మూవీ రిలీజ్ అవుతున్నట్లు అనౌన్స్ చేశారు మేకర్స్. ఇందులో రాశీ ఖన్నా తో పాటుగా కన్నడ ముద్దుగుమ్మ శ్రీనిధి శెట్టి మరో హీరోయిన్‌గానటిస్తోంది.
అయితే సౌత్‌లో లీడ్ యాక్టర్‌కు తక్కువ... సెకండ్ హీరోయిన్‌కు ఎక్కువగా క్యారెక్టర్స్ వస్తున్న నేపథ్యంలో, బాలీవుడ్‌పై ఫోకస్ చేసిన రాశీ ఖన్నాకు అక్కడ అదే సిచ్యుయేషన్. దీంతో "తెలుసుకదా" లో తన క్యారెక్టర్‌కు, వెయిట్ ఎక్కువ ఉండటంతో తృప్తి పడింది ఈ ముద్దుగుమ్మ. అందులోనూ బీ టౌన్ కాబట్టి సరిపెట్టు కుంటుంది. ప్రజెంట్ బాలీవుడ్‌లో "తలకోన్ మే ఏక్", "ఫర్డీ2" చేస్తోంది. "సబర్మతి ఎక్స్ ప్రెస్" హీరో విక్రాంత్ మాస్సేతో మరోసారి స్క్రీన్ షేర్ చేసు కుంటుంది. ఇక టూ ఇయర్స్ తర్వాత టాలీవుడ్‌ను పలకరిస్తున్న రాశీ ఖన్నా... మళ్లీ తెలుగులో బిజీ గా మారుతుందా...? లేక బాలీవుడ్‌లోనే ఉండిపోతుందా..? చూడాలి...

## 'అఖండ 2' నుంచి బిగ్ అప్‌డేట్..
# టీజర్‌కి ముహూర్తం ఫిక్స్



**టాకీస్:** నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతున్న సంచలన చిత్రం 'అఖండ 2'. అఖండ సినిమాకి సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. 'అఖండ' సృష్టించిన ప్రభంజనం తర్వాత, దాని సీక్వెల్ 'అఖండ 2'పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించిన చిత్ర యూనిట్, ఇటీవలే జార్జియాలో కూడా షూటింగ్ కూడా కంప్లీట్ చేసుకున్నట్లు సమాచారం. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి టీజర్ అప్‌డేట్‌ను ప్రకటించారు మేకర్స్. ఈ సినిమా టీజర్‌ను జూన్ 09న సాయంత్రం 06.03 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్నారు. సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా, యంగ్ హీరో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నారు. బాలయ్య మరోసారి అఘోరి పాత్రలో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమవుతున్నారు. ఈ సినిమా 2025 సెప్టెంబర్ 25న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# మూవీ లవర్స్‌కి గుడ్ న్యూస్.. హైదరాబాద్‌కి తిరిగి వస్తున్న ఐమాక్స్

**టాకీస్:** తెలుగు మూవీ లవర్స్ ఐమాక్స్ ఫార్మాట్‌కి దూరమై దాదాపు 10 ఏండ్లు గడుస్తున్న విషయం తెలిసిందే. ఇంతకుముందు ఐమాక్స్ ఫార్మాట్ ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లో ఉండగా.. దాని నిర్వహణ ఖర్చులు ఎక్కువ అవ్వడంతో దానిని తొలగించి ఆ స్థానంలో పీసీఎక్స్‌ను తీసుకోచ్చారు ప్రసాద్ నిర్వహాకులు. అయితే హాలీవుడ్ సినిమాలతో పాటు మన దగ్గర వచ్చిన పలు ఇండియన్ సినిమాలను ఐమాక్స్ ఫార్మాట్‌లో చూద్దామనుకుంటే అభిమానులకు నిరాశ ఎదురయ్యేది. అయితే తాజాగా మూవీ లవర్స్‌కి గుడ్ న్యూస్ చెబుతూ మళ్లీ హైదరాబాద్‌లో ఐమాక్స్ ఫార్మాట్ రాబోతుంది.




ప్రముఖ నిర్మాత, ఏషియన్ సినిమాస్ అధిపతి సునీల్ నారంగ్ ఒక కొత్త ఐమాక్స్ థియేటర్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఐమాక్స్ థియేటర్‌ను హకింపేట్‌లో నిర్మిస్తున్నట్లు.. మరో రెండేళ్లలో ఇది అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. దీంతో ఈ వార్త తెలుగు సినీ ప్రేక్షకులను కొత్త ఉత్సాహాన్ని నింపింది. మరోవైపు ఈ వార్త మహేశ్ అభిమానులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబోలో ఒక సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఎస్ఎస్ఎంబీ29 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్ మరో ఏడాదికి కానీ విడుదల అయ్యేలా లేదు. అయితే ఈ సినిమా వచ్చేలోపు ఐమాక్స్ ఫార్మాట్ హైదరాబాద్‌లో అందుబాటులోకి వస్తే.. సినిమాను ఐమాక్స్ స్క్రీన్‌పై చూడవచ్చని మహేశ్ అభిమానులు ఆశ పడుతున్నారు. అయితే దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది.

# ఓజీ షూటింగ్ కూడా పూర్తి చేసిన పవన్..

**టాకీస్:** రాజకీయాలతో బిజీగా ఉండడం వలన పవన్ కళ్యాణ్ ఈ మధ్య సినిమాలు చేయడం తగ్గించారు. అయితే కమిటైన క్రమంలో గతంలో మూడు సినిమాలు పూర్తి చేసే పనిలో పడ్డారు. కొద్ది రోజుల క్రితం హరిహర వీరమల్లు సినిమా షూటింగ్ పూర్తి చేసిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఓజీ చిత్రం కూడా పూర్తి చేసినట్టు తెలుస్తుంది. హరిహర వీరమల్లు తర్వాత తన పూర్తి సమయాన్ని ఓజీ చిత్రానికి కేటాయించారు పవన్ . ఈ క్రమంలో చిత్ర షూటింగ్ తాజాగా పూర్తైందని మేకర్స్ తెలియజేశారు. గంభీర షూటింగ్ ను ముగించాడు.. ఇక ఓజీ రిలీజ్ కు రెడీ అవుతుంది అంటూ మేకర్స్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఇక ఓజీ షూటింగ్ ఫినిష్ కావడంతో మూవీ అనుకున్న టైంకి వస్తుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.



కొద్ది రోజుల క్రితం ఓజీ చిత్రాన్ని సెప్టెంబర్ 25 న విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఆ డేట్‌కి రిలీజ్ చేసేలా పనులు శరవేగంగా జరుపుతున్నారు. కుర్ర డైరెక్టర్ సుజీత్ ఈ చిత్రంలో పవన్ ను ఒరిజినల్ గ్యాంగ్ స్టార్ గా చూపించనున్నాడు. చిత్రంలో పవన్ సరసన ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తుంది. బాలీవుడ్ స్టార్ హీరో ఇమ్రాన్ హష్మీ విలన్ గా నటిస్తుండగా.. అర్జున్ దాస్ , శ్రీయా రెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, ఫస్ట్ గ్లింప్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆ మధ్య పవన్ కళ్యాణ్ ముంబైలో షూటింగ్ పాల్గొన్నటువంటి విజువల్స్ బయటకు వచ్చాయి. ఇందులో పవన్ కళ్యాణ్ ని చూసి ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ఓజీ' చిత్రంలో పవన్ కళ్యాణ్ ఓజస్ గంభీరా అనే ముంబై అండర్ వరల్డ్ డాన్ పాత్రలో కనిపించనున్నారు. కథ ప్రకారం, ఓజస్ గంభీరా పదేళ్ల విరామం తర్వాత ముంబైకి తిరిగి వచ్చి, తన సామ్రాజ్యాన్ని తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తాడని అర్ధమవుతుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.